
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
గురువారం 8 మే 2025

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 40.0
కనిష్ఠం : 26.0

సిందూర్ మహానాదం


ఏలూరులో మాక్‌డ్రిల్‌లో భాగంగా ప్రజలను అప్రమత్తం చేస్తున్న పోలీసులు



అంతటా యుద్ధ ఆసక్తి, ఉత్కంఠ

- స్థానిక, అంతర్జాతీయ మార్కెట్లపై ఆరా
- యుద్ధ వార్తల కోసం నెట్‌లో అన్వేషణ
- యూట్యూబ్, వాట్సాప్‌ల్లోనూ అత్యధికులు
- యుద్ధ సన్నద్ధతపై పలుచోట్ల మాక్‌డ్రిల్
- అధికారులతో కలెక్టర్ వెట్రిసెల్వి సమీక్ష

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

సిందూర్ ఈ పదమే అనేక మందిలో రక్తం ఉప్పొంగేలా చేస్తోంది. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెళ్లగించాలని ఈ దిశగా సమరనాదానికి దిగితే తాము కూడా సైఅంటూ నినాదాలు చేస్తున్నారు. ఇప్పుడు అంతటా యుద్ధసన్నద్ధమే. నిన్న, మొన్నటి వరకు పాకిస్థాన్‌పై భారత్ బెదిరింపులతో సరిపెడుతుందని అందరూ భావించారు. కానీ ఇంకోవైపు ఉగ్రవాదాన్ని తుదిముట్టించేందుకు సిందూర్ పేరిట సింహనాదం చేశారు. ఇంకేముంది ఊరూ, వాడా ఇదే నినాదం. పోలీస్ బలగాలు యుద్ధసన్నద్ధతపై జిల్లాలో పలుచోట్ల మాక్‌డ్రిల్ చేశారు. ఉమ్మడి పశ్చిమలో అన్నిచోట్ల యుద్ధకథనాలు, సమాచారంపై ప్రజలు ఆసక్తి కనబరిచారు. ఇప్పటికే భారత్ ఆర్మీలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన సైనికులైతే తామూ కూడా యుద్ధభూమిలో పోరాడేందుకు సిద్ధమేనన్నట్లు సంకేతాలిస్తున్నారు. దీనికితోడు యుద్ధానికి సంబంధించి అన్ని వర్గాల్లోనూ ఆసక్తి, ఉత్కంఠ మరింత పెరిగింది. కేంద్రం ఈ విషయంలో ఎలాంటి చర్యలకు దిగినా తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. నిన్న, మొన్నటి వరకు యూట్యూబుల్లో సరదా రీల్స్‌లో సరిపెట్టుకున్న వారంతా ఇప్పుడు యుద్ధంపై ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. నెట్‌లో వస్తున్న అప్‌డేట్‌ల కోసం అన్వేషణ భారీగా పెరిగింది. యుద్ధం లాభ, నష్టాలు, పాకిస్థాన్‌పై యుద్ధం సబబేనా లేదా కాదా అనే అంశాలు చర్చకు వచ్చినప్పుడు యుద్ధ సన్నాహాలకు అనుగుణంగానే స్పందిస్తున్నారు. ఇప్పటికే అంతర్జాతీయ తీరుతెన్నులు భవిష్యత్‌లో ఎలా ఉండబోతున్నాయో వ్యాపార వర్గాలన్నీ ఇప్పటికే మునిగితేలాయి. నిత్యావసరాల ధరలు ప్రత్యేకించి చమురు ధరలతోపాటు మరికొన్ని నిత్యవసరాలు చుక్కలనంటే అవకాశం ఉందనే భావన మరింత పుంజుకుంది.


సమీక్షిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి

అందరిదీ.. ఆ వైపు చూపే..

బీజేపీతోపాటు మిగతా పార్టీల క్యాడర్ యుద్ధ కార్యక్రమాలపై ఉత్కంఠకు గురవుతున్నాయి. బీజేపీ యుద్ధానికి అనుకూలంగా పిడికిలి బిగిస్తోంది. సోషల్ మీడియాలో సాధ్యమైనన్ని పోస్టులు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. కమ్యూనిస్టు పార్టీలు యుద్ధసన్నద్ధతను ఆమోదించడం లేదు. అంతర్జాతీయంగా ఇప్పటికే ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న తరుణంలో యుద్ధం సబబు కాదనే అభిప్రాయం ఆ పార్టీల్లో వినిపిస్తోంది. సీపీఐ అగ్రనాయకత్వం పూర్తిగా వ్యతిరేకిస్తోంది. ఈ ప్రభావం స్థానిక నేతలపై పడింది. టీడీపీ, వైసీపీ ఈ దిశగా ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. పట్టణాల్లోనే కాకుండా పల్లెల్లోను ఈ తరహా పరిస్థితులే కనిపిస్తున్నాయి. ఒకరిద్దరు గుమిగూడితే చాలు పాకిస్థాన్ పని అయిపోయినట్లుగానే చర్చకు దిగుతున్నారు. కేంద్రంలో బీజేపీ దూకుడుపై కొందరు ఆమోదం ప్రదర్శిస్తుండగా, ఇంకొందరు వ్యతిరేకిస్తున్నారు.

మాక్‌డ్రిల్‌పై కలెక్టర్ సమీక్ష

మాక్‌డ్రిల్‌పై కలెక్టర్ వెట్రిసెల్వి ప్రత్యేకంగా సమీక్షించారు. గౌతమీ సమావేశం హాల్లో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. యుద్ధ పరిస్థితుల దృష్ట్యా రాష్ట్రంలో ఎటువంటి అత్యవసర పరిస్థితి తలెత్తినా ప్రాణరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై విపత్తు నివారణ శాఖ, పోలీస్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామ, పట్టణ ప్రాంతాల్లో సైరన్‌తో ప్రజలను అప్రమత్తం చేయాలని, ఆ సమయంలో పౌరులందరూ సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలన్నారు. సమావేశంలో జేసీ ధాత్రిరెడ్డి పాల్గొన్నారు.



యుద్ధసన్నద్ధత.. అప్రమత్తం

యుద్ధసన్నద్ధత దిశగా స్థానికుల్ని అప్రమత్తం చేసే పని ఆరంభమైంది. బుధవారం ఏలూరు జిల్లా కేంద్రంతోపాటు పలు మండలాల్లోను మాక్‌డ్రిల్ నిర్వహించారు. హఠాత్తుగా ఎలా తమను తాము కాపాడుకోవాలో ప్రజల్లో చైతన్యం తెచ్చేలా స్థానికులను పోలీసు బలగాలు మరింత అప్రమత్తం చేశాయి. కేంద్రం ప్రకటించిన 244 జిల్లాలే కాకుండా ఏలూరు వంటి జిల్లాలోను మాక్‌డ్రిల్ నిర్వహించారు. ప్రజలను అప్రమత్తం చేయడానికే మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్నట్టు ఐజీ అశోక్‌కుమార్ వెల్లడించారు. ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో జరిగిన మాక్‌డ్రిల్‌ను పెద్దఎత్తున ప్రజలు తిలకించారు.

సిందూర్‌తో ఉగ్రవాదం అంతం

మంత్రి కొలుసు పార్థసారథి



భారతదేశంతో పెట్టుకుంటే ఎలా ఉంటుందో ఇప్పటికీ పాకిస్థాన్‌కు అర్థమయ్యి ఉంటుంది. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు ఇండియన్ ఆర్మీ తగిన బుద్ధి చెబుతుంది. ఆపరేషన్ సిందూర్ ఉగ్రవాదం అంతానికి శాశ్వత పరిష్కారం అడుగులు పడుతున్నాయి. భారత్ సైన్యానికి నా అభినందనలు .

యుద్ధానికి మేము సైతం



పాకిస్థాన్‌పై సరైన సమయంలో భారత్ సరైన దెబ్బకొట్టిందని మిలటరీ మాధవరానికి చెందిన మాజీ సైనికులు కొనియాడారు. ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడంతో మన సైనిక శక్తి మరోసారి ప్రపంచానికి తెలిసి వచ్చిందని అన్నారు. యుద్ధానికి వెళ్లాల్సి వస్తే తాము సైతం ముందుకు వెళతామని స్పష్టం చేశారు.

■ లోపలి పేజీలో..

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

- ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఏర్పాటు సమీక్షలో కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు అర్బన్, మే 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ వెట్రిసెల్వి సూచించారు. ఈ నెల 12 నుంచి 20 వరకు జరగనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను బుధవారం కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఫస్టియర్ పరీక్షలకు 10,068 మంది, సెకండియర్ పరీక్షలకు 3,035 మంది జనరల్, ఒకేషనల్ విభాగాల్లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 34 కేంద్రాల్లో పరీక్షలు సజావుగా జరిగేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే బాల బాలికలకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు సమాచారం కోసం ఏలూరు ఆర్ఐవో కార్యాలయంలో 08812-230197 నెంబరుతో కంట్రోల్ రూమ్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. డీఆర్వో విశ్వేశ్వరరావు, ఆర్ఐవో యోహాన్, డీఐఈవో శేఖర్‌బాబు, డీపీవో అనురాధ, ఆర్టీసీ డీఎం వాణి, తపాలాశాఖ అధికారులు, పరీక్షల కమిటీ సభ్యులు శ్యామ్‌కుమార్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రబీలో 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ : జేసీ

ఏలూరు రూరల్, మే 7(ఆంధ్రజ్యోతి):ప్రస్తుత రబీలో రైతుల నుంచి ఇప్పటి వరకు రూ.501 కోట్లు విలువ చేసే 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని జేసీ ధాత్రిరెడ్డి చెప్పారు. జిల్లాలో ధాన్యం సేకరణపై జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను బుధవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో ధాన్యం దిగుబడి అధికంగా వచ్చిందన్నారు. ప్రస్తుత రబీలో 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యాన్ని నిర్ణయించామని, ఇంత వరకు రూ.501 కోట్ల విలువైన 2.17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేసి రూ.390 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు ఎక్కడా ధాన్యం దెబ్బతినలేదని, రైతుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు నమోదు కాలేదన్నారు. 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కస్టమ్ మిల్లింగ్ రైస్ లక్ష్యంగా ఎఫ్‌సీఐకి నిర్ణయించామన్నారు. జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శివ రామ్మూర్తి, డీఎస్‌వో ప్రతాప్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకి పాల్గొన్నారు.

'సంక్షేమ' టెన్త్, ఇంటర్ టాపర్లకు పురస్కారాలు

■ లోపలి పేజీలో..

బిల్లుల సమస్యలు తీర్చండి

- సోలార్ ప్యానెల్స్ ఉన్నా బిల్లుల భారం తప్పడం లేదు..
- అస్తవ్యస్తంగా విద్యుత్ సరఫరా
- పామాయిల్ తోటల్లో లైన్‌మీద ఆకుల సమస్య..
- ఏపీఈపీడీసీఎల్ జిల్లా ఎస్‌ఈ సాల్మన్‌రాజుకు సమస్యలు తెలిపిన వినియోగదారులు
- 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్'కు విశేష స్పందన



ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

ఏలూరు సిటీ, మే 7(ఆంధ్రజ్యోతి): ఏలూరులో జిల్లా విద్యుత్ భవన్‌లో ఏపీఈపీడీసీఎల్ జిల్లా ఎస్ఈ పి.సాల్మన్ రాజుతో బుధవారం జరిగిన 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. విద్యుత్ వినియోగదారులు పలు సమస్యలను విన్నవించారు. ఈ సమస్యలను సావధానంగా విన్న ఆయన వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా జిల్లాలో విద్యుత్ కోతలు, సరఫరాలో సమస్యలు లేవని, వేసవిని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో మెరుగైన విద్యుత్ సరఫరాను అందిస్తున్నామన్నారు. కాగా నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల విద్యుత్ శాఖ ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలోనే ఉంది. ఆయా ప్రాంతాల నుంచి విద్యుత్ శాఖకు సంబంధించి పలు సమస్యలు వచ్చాయి. సంబంధిత విద్యుత్ శాఖాధికారులకు ఈ విషయాన్ని తెలిపి ఆ సమస్యలను పరిష్కరిస్తామని ఎస్ఈ హామీ ఇచ్చారు.

- సోలార్ రూఫ్‌టాప్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకున్నాం. విద్యుత్ బిల్లుల మెస్సేజ్ ఇస్తున్నారు గాని బిల్లులు భౌతికంగా ఇవ్వడం లేదు. పాత బిల్లు ఎంత ఉందో, విద్యుత్ ఎంత ఉత్పత్తి అయిందో తెలియడం లేదు.

- శివకేశవరావు, దెందులూరు

విద్యుత్ శాఖ ఎస్ఈ : సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. సాంకేతిక కారణాల వల్ల ఈ పరిస్థితులు వచ్చాయి. సంబంధిత ఏఈని మీ వద్దకు పంపిస్తాం.

- ఐదు కిలోవాట్ సూర్యఘర్ యోజనలో సోలార్‌రూఫ్ టాప్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకున్నాం. ఇప్పటివరకు సరాసరి నాకు నెలవారీ రూ.1500 విద్యుత్ బిల్లులు వచ్చేవి. ఆరు నెలలకు రూ.9 వేలు బిల్లులు చెల్లించాను. అయితే ఇప్పుడు సోలార్ రూఫ్ టాప్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి అవుతున్నా ఆన్‌లైన్‌లో నేను గతంలో చెల్లించిన బిల్లు కనబడుతోంది. ఈ సమస్య పరిష్కరించమని ఇప్పటికే డీఈ, ఏఈలను కోరినా ఫలితం లేదు.

- డి.చౌదరి, పత్తేబాద, ఏలూరు

ఎస్ఈ : సాంకేతిక కారణాల వల్ల ఇలా జరుగుతోంది. ఈ సమస్యను వెంటనే పరిష్కస్తాం. బిల్లును రివైజ్ చేయడం జరుగుతుంది. (ఈ సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు).

- విద్యుత్ బిల్లు గతంలో మాకు నెలకు రూ.250 వచ్చేది. ఇప్పుడు రూ.450 వస్తోంది. కారణం ఏమిటో తెలియడం లేదు. ఈ సమస్యను పరిష్కరించాలి

- వెంకటేశ్వరరావు, గోగులంపాడు, ముసునూరు మండలం

ఎస్ఈ : సంబంధిత అధికారులకు ఈ సమస్యను తెలియపరుస్తాం.

- పామాయిల్ తోటల్లో లైన్‌మీద ఆకులను రైతులే తొలగించాలని విద్యుత్ శాఖ సిబ్బంది చెబుతున్నారు. విద్యుత్ లైన్ల మీద ఆకులు తొలగిస్తూ ఒక రైతు మృతి చెందాడు. అసలు లైన్‌మీద ఆకులు తొలగించాల్సిన బాధ్యత ఎవరిది. రైతులదా...? విద్యుత్ సిబ్బందిదా..?.

- బి.నరేంద్రబాబు, అడమిల్లి, కామరపుకోట మండలం

ఎస్ఈ : విద్యుత్ లైన్లపై ఆకులు తొలగించే బాధ్యత విద్యుత్ సిబ్బందిదే. దీనిని పరిశీలించి సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం.

- పగలు, రాత్రి తేడా లేకుండా విద్యుత్ సరఫరా తీసివేస్తున్నారు. ఇప్పుడే విద్యుత్ కోతలు ఇలా ఉంటే రాబోయే రోజుల్లో ఎలా ఉంటాయో..?

- లక్ష్మి, కైకలూరు

ఎస్ఈ : ఈ సమస్యను సంబంధిత అధికారులకు తెలియజేస్తాం.

- ఒక నెల విద్యుత్ బిల్లు చెల్లించినా, మళ్లీ నెలలో ఆ బిల్లుతో కలిపి కొత్తగా విద్యుత్ బిల్లు వస్తోంది. ఒకటో తారీకున విద్యుత్ బిల్లు రూ.586 చెల్లిస్తే, మళ్ళీ కొత్త బిల్లులో పాత బిల్లు మొత్తం కలుస్తోంది. ఈ సమస్యను పరిష్కరించాలి.

- యుగంధర్‌రెడ్డి, ప్రగడవరం, చింతలపూడి మండలం

ఎస్ఈ : సాంకేతిక పరమైన కారణాల వల్ల ఆ విధంగా జరిగి ఉంటుంది. బిల్లు రివైజ్ చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తాం.

- విద్యుత్ సరఫరా సక్రమంగా రావడం లేదు. ఇబ్బందులు పడుతున్నాం.

- రహీమ్, కైకలూరు

ఎస్ఈ : ఈ సమస్యను ఆ ప్రాంత విద్యుత్ శాఖాధికారులకు తెలిపి పరిష్కారమయ్యేలా చూస్తాం.

వరుడైన చినతిరుమలేశుడు



నుదుట కల్యాణ తిలకం.. బాసికాలు, బుగ్గన చుక్కతో ముగ్ధమనోహర రూప లావణ్యాలను ఒలికిస్తూ... అలివేలు మంగ, ఆండాళ్ అమ్మ వార్లు, శ్రీవారు వధూవరులుగా ముస్తాబయ్యారు. ద్వారకాతిరుమల చినవెంకన్న వైశాఖ మాస బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. విశేష పూజలు, వాహన సేవలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

■ లోపలి పేజీలో..

జై వాసవి.. జైజై వాసవీ



జై వాసవీ నామస్మరణతో పెనుగొండ క్షేత్రం మార్మోగింది. వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి సందర్భంగా బుధవారం కర్ణాటక, తమిళనాడు, కేరళ, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి పూజలు చేశారు. వాసవి దీక్షాధారులు, శాంతి ధామ్ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి, 102 కలశాలతో మహిళలు ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

దేవాలయాల ట్రస్ట్ బోర్డుల ఏర్పాటుకు..
గ్రీన్ సిగ్నల్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో 75 ఆలయాలు, సత్రాలకు ట్రస్ట్ బోర్డులు ఏర్పాటుకు దేవదాయశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు జీవో జారీ అయిన తేదీ నుంచి ఇరవై రోజుల్లో అర్హులైన హిందువులు బోర్డుల్లోని పదవులకు దరఖాస్తు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో, ఆయా దేవాలయాల పరిధిల్లో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయన్నారు. నామినేటెడ్ పదవుల కోసం చాలాకాలం నుంచి ఎదురు చూస్తున్న టీడీపీ, జనసేన బీజేపీ నేతలు ఇక హుషారుగా పదవుల కోసం దరఖాస్తులు చేసుకోనున్నారు. ప్రధానంగా అభయాంజనేయ స్వామి, పెద్దింట్లమ్మ గుడి, పట్టిసీమలోని వీరేశ్వరస్వామి తదితర మేజర్ దేవాలయాలతో పాటు ఆదాయం వచ్చే సత్రాలు, విద్యాలయాలకు పోటీ ఉత్పన్నమయ్యే పరిస్థితులు ఉన్నాయి. ట్రస్ట్ బోర్డు నియామకాలపై జిల్లా దేవ దాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రంగారావు మాట్లాడుతూ హిందువులై ఉండి, 30 ఏళ్ల వయస్సు నిండిన వారు దరఖాస్తులను చేసుకోవాలన్నారు.

ట్రస్ట్ బోర్డులు ఏర్పాటు చేసే ఆలయాలు..

జంగారెడ్డిగూడెం మండలం వేణుగోపాల స్వామి గుడి (జంగారెడ్డిగూడెం), చింతలపూడి మండలంలో వేగిలింగేశ్వరస్వామి గుడి (చింతలపూడి), కామవరపుకోట మండలంలో గాంగేశ్వరస్వామిగుడి (తడికలపూడి), సీతారామ స్వామిగుడి (రావికంపాడు), పెదపాడు మండలంలో అభయాంజనేయస్వామిగుడి (అప్పనవీడు), శ్రీభీమేశ్వరస్వామిగుడి (కలపర్రు), రాజగోపాల స్వామి గుడి (కలపర్రు), దెందులూరు మండలంలో సీతారామస్వామిగుడి (సానిగూడెం), ఏలూరు టౌన్, రూరల్ మండలంలో గాంధీ ఆంధ్రజాతీయ మహావిద్యాలయం (అగ్రహారం), వేంక టేశ్వరస్వామి గుడి (తూర్పువీధి), కంది అయ్యన్న సత్రం (పవర్‌పేట), రంగరాజ్ మఠ్ అలియాస్ ఆంజనేయస్వామిగుడి (దక్షిణపువీధి), చెరుకువాడ వారి సత్రం (పవర్‌పేట), చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి గుడి (పవర్‌పేట), శ్రీరామ మందిరం (తూర్పులాకులు), చుండూరి వారి సత్రం (పవర్‌పేట), మద్దుల వారి సత్రం (పవర్‌పేట), కనకదుర్గమ్మ గుడి (పత్తేబాద), మార్కండేయ ఓంకార విశ్వేశ్వర స్వామి గుడి (దక్షిణపువీధి), తలాటం పట్టయ్య సుబేదార్ సత్రం (గన్‌బజార్), కాశీవిశ్వేశ్వర స్వామి (పవర్‌పేట), కనకదుర్గమ్మగుడి (12 పంపుల సెంటర్), నల్లా బసవలింగం సత్రం (గవరవరం), వేంకటేశ్వరస్వామిగుడి (ఆర్‌ఆర్ పేట), ముదినేపల్లి మండలంలో శ్రీ లక్ష్మీనర్సింహస్వామిగుడి (సింగరాయపాలెం), అమృతేశ్వరస్వామిగుడి (సింగరాయపాలెం), వేణుగోపాల స్వామిగుడి (గురజ), లోకేశ్వర, జనార్దనస్వామి గుడి (కోడూరు), రామలింగేశ్వరస్వామి గుడి (గురజ), జనార్దనస్వామి గుడి (వడాలి), ఆగిరిపల్లి మండలంలో దుగ్గిరాల రావమ్మ గుడి (తోటపల్లి), శోభానాచల స్వామి గుడి (ఆగిరిపల్లి), నూజివీడు మండలంలో కోట మహిషాసురమర్దిని గుడి (నూజివీడు), వెంకటాచల స్వామిగుడి (నూజివీడు), కోడిమళ్ల కొండయ్య శ్రీరామ విలాశాంద్రమ్మ సత్రం (నూజివీడు), రఘునాథస్వామి సత్రం (గొల్లపల్లి), ముసునూరు మండలంలో రామలింగేశ్వర స్వామి (బలివే), టి.నర్సాపురం మండలంలో కాశీ విశ్వేశ్వరస్వామి గుడి - మిగతా 8లో



నియామకాలకు అర్హతలివే ..

వార్షిక ఆదాయం రూ.ఐదు లక్షలు పైబడి రూ.25 లక్షలు వచ్చే దేవాలయాలు, సత్రాలకు 9 మంది సభ్యులుంటారు. ఇందులో బ్రాహ్మణవర్గానికి చెందిన వారు ఒకరుండాలి. 50 శాతం అనగా సుమారు 5 మంది మహిళలుండాలి, వారిలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందినవారు ఉండాలి. నాయీ బ్రాహ్మణులు ఒకరుండాలి. రూ.25 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉండే దేవాలయాలు, సత్రాల్లో 11 మంది సభ్యులను తీసుకోవచ్చు. ఇందులో బ్రాహ్మణవర్గానికి చెందిన ఒకరిని తీసుకోవాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన ఆరుగురు మహిళలు ఉండాలి. ఓ నాయీ బ్రాహ్మణుడిని ఖచ్చితంగా తీసుకోవాలి. వార్షిక ఆదాయం రూ.కోటి నుంచి రూ.5 కోట్ల వరకు వచ్చే వాటిల్లో 11 మంది సభ్యులకు గాను ఒక బ్రాహ్మణుడిని విధిగా తీసుకోవాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన ఆరుగురు మహిళలు ఉండాలి. ఓ నాయీ బ్రాహ్మణుడిని తీసుకోవాలి. రూ. 5 కోట్ల నుంచి రూ.20 కోట్ల లోపు అయితే 13 మంది సభ్యులు, రూ.20 కోట్ల పైన ఉండే దేవాలయాలు, సత్రాలకు 17 మంది ట్రస్ట్ సభ్యులుంటారు.

వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం ప్రయోజనకరం

ఏలూరుసిటీ, మే 7(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంతో ఎంతో ప్రయోజనం కలుగుతుందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై గ్రూప్ కన్వీనర్లకు, అధికారులకు అవగాహన కార్యక్రమం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 27 మండలాల్లో ప్రభుత్వం సబ్సిడీపై డ్రోన్‌లను అందించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. తొలివిడతగా 40 డ్రోన్లను ప్రభుత్వం జిల్లాకు కేటాయించిందన్నారు. వీటి కొనుగోలుకు రైతులకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీని అందిస్తోందన్నారు. ఇప్పటికే 31 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. జేసీ ధాత్రిరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి హబీబ్‌బాషా, ఏపీఎంఐపీ పీడీ రవికుమార్, ఎల్‌డీఎం నీలాద్రి, వివిధ బ్యాంకుల అధికారులు, శిక్షణ పొందిన డ్రోన్ పైలెట్ రైతులు, పలువురు వ్యవసాయ శాఖాధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో రేపు వేడిగాలుల తీవ్రత

ఏలూరు సిటీ, మే 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మళ్లీ వేడిగాలుల తీవ్రత మొదలైంది. ఒక పక్క బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నా వేడిగాలుల తీవ్రత పెరుగుతోంది. ఈనెల 8న జిల్లాలో వేడిగాలుల తీవ్రత లేకున్నా ఉష్ణోగ్రతలు చాలా ప్రాంతాల్లో 41 డిగ్రీల సెంటీగ్రేడ్ దాటి నమోదవుతాయని, 9న జిల్లాలోని వేలేరుపాడు మండలంలో 45.8 సెంటీగ్రేడ్, అత్యంత వేడి గాలుల తీవ్రత కొనసాగుతుందని, కుక్కునూరు మండలంలో 45 డిగ్రీల సెంటీగ్రేడ్ నమోదై వేడిగాలుల తీవ్రత కొనసాగుతుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో 40 నుంచి 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఆ సంస్థ తెలిపింది.

'సంక్షేమ' టెన్త్, ఇంటర్ టాపర్లకు పురస్కారాలు

ఏలూరు అర్బన్, మే 7 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది జరిగిన పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రభుత్వం పురస్కారాలకు ఎంపికచేసింది. సాంఘిక సంక్షేమ గురుకులాలు, వసతిగృహాలు, గిరిజన సంక్షేమ గురుకులాలు, గిరిజన సంక్షేమ వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో ఆయా గ్రూపులవారీగా ప్రతిభ కనబరిచి పురస్కారాలకు ఎంపికైన జిల్లా విద్యార్థుల వివరాలు ఇలా ఉన్నాయి. సీనియర్ ఇంటర్ ఫలితాల్లో ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నుంచి రాష్ట్ర స్థాయి పురస్కారానికి బుట్టాయిగూడెం బాలికల జూనియర్ కళాశాల విద్యార్థిని ఎన్.సంధ్య (బైపీసీ 979 మార్కులు), జె.నందిత (హెచ్ ఈసీ 938), ఎన్.స్వాతి (హెచ్ఈసీ 927) ఎంపికయ్యారు. సిల్వర్ ర్యాంకర్ పురస్కా రాలకు పదోతరగతి పరీక్షల్లో నూజివీడు సోషల్‌వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూలు విద్యార్థిని పి.దేవిహర్షిత (578 మార్కులు), భీమడోలు సోషల్‌వెల్ఫేర్ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని వి.స్నేహగీతిక (565), ట్రైబల్‌వెల్ఫేర్ స్కూల్స్ నుంచి బుట్టాయిగూడెం గిరిజన రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థిని వరిక.భవ్యశ్రీ (525), సీని యర్ ఇంటర్‌లో ద్వారకాతిరుమల సోషల్ వెల్ఫేర్ కళాశాల విద్యార్థిని ఎన్.దుర్గాభవాని (బైపీసీ 981) ఎంపికయ్యారు. హాస్టల్ సీనియర్ ఇంటర్ విద్యార్థుల్లో జిల్లాస్థాయి సిల్వర్ ర్యాంకర్స్ పురస్కారాలకు ఏలూరు సోషల్ వెల్ఫేర్ బాలికల వసతిగృహం-1 విద్యార్థిని ఎం.అఖిల (ఎంపీసీ 939), బుట్టాయిగూడెం ట్రైబల్‌వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాల విద్యార్థిని బి.హర్షిక (978) ఎంపికయ్యారు. సోషల్‌వెల్ఫేర్ హాస్టల్స్‌లో ఉత్తమప్రతిభ కనబరిచినవారికిచ్చే బెస్ట్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ పురస్కారాలకు ఏలూరు బాలికల కళాశాల-2 ఏఎస్‌డబ్ల్యువో, చింతలపూడి ఇంటిగ్రేటెడ్ కళాశాల బాలికల హాస్టల్ సంక్షేమాధికారి ఎంపికయ్యారు. పదో తరగతి పరీక్షల్లో 140 మంది విద్యార్థుల ఉత్తీర్ణతతో నూరుశాతం ఫలితాలను సాధించిన చింతలపూడి సోషల్ వెల్ఫేర్ హాస్టల్ ఏఎస్‌డబ్ల్యువోను రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపిక చేశారు. వీరందరికీ నగదు బహుమతులు అందజేస్తారు.

పశ్చిమ నుంచి ముగ్గురికి

తాడేపల్లిగూడెం రూరల్, మే7 (ఆంధ్రజ్యోతి): సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్‌లో చదివి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రభుత్వం అందించే రాష్ట్రస్థాయి పురస్కారాలకు పశ్చిమ గోదావరి జిల్లాలో ముగ్గురు ఎంపికయ్యారు. నరసాపురంకు చెందిన మౌనిషా బైపీసీలో 966 మార్కులు సాధించి గ్రూప్ వైజ్ మొదటి ర్యాంకు సాధించగా,తణుకుకు చెందిన సీహెచ్ అనూష (బైపీసీ 962 మార్కులు) శోభారాణి (హెచ్ఈసీలో 916) ప్రతిభా పురస్కారాలకు ఎంపికయ్యారు.


తాడేపల్లిగూడెం వాసవీ ఇంజనీరింగ్ కళాశాల వద్ద పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు

ప్రశాంతంగా ఏపీ ఐసెట్ పరీక్షలు

ఏలూరు అర్బన్/ తాడేపల్లిగూడెం రూరల్ / భీమవరం రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు బుధవారం జరిగిన ఏపీ ఐసెట్ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. ఏలూరు సిద్దార్థ క్వెస్ట్ స్కూలులో జరిగిన పరీక్షకు ఉదయం షిఫ్టులో 180 మందికి 155, మధ్యాహ్నం షిఫ్టులో 180 మందికి 157, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ఉదయం 84, మధ్యాహ్నం 87, సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 177, మధ్యాహ్నం 166 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లాలో పెదతాడేపల్లి వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 230 మందికి 215 మంది, మధ్యాహ్నం 215 మందికి 206 మంది పరీక్షలు రాశారు. శశి ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 220 మందికి 205, మధ్యాహ్నం 222 మందికి 202 మంది పరీక్షలు రాశారు.భీమవరం పట్టణంలో నాలుగు కేంద్రాల్లో నిర్వహించారు. డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో 210 మందికి 193, విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో 186 మందికి 171 మంది, డీఎన్నార్ డిగ్రీ కళాశాలలో 200 మందికి 187 మంది, విష్ణు మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో 200 మందికి 179 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.



డ్రైవర్ అవతారమెత్తిన సర్పంచ్

ఆయన ఆ ఊరికి సర్పంచ్.. ఊరి బాగోగులు చూసుకోవాల్సిన వ్యక్తి.. గ్రామంలో చెత్త సేకరణకు ట్రాక్టర్ లేకపోవడంతో ట్రాక్టర్ ఇచ్చారు.. అంతేకాదు డ్రైవర్ లేకపోవడంతో ఆయనే డ్రైవర్ అవతారం ఎత్తారు. పెంటపాడు మండలం కోరుమిల్లి గ్రామంలో చెత్తను సేకరించేందుకు ట్రాక్టరు లేదు. దీంతో ఆ ఊరి సర్పంచ్ గారపాటి ఉదయభాస్కరరావు తన సొంత ట్రాక్టరును చెత్త సేకరించేందుకు ఇచ్చారు. డ్రైవర్ లేకపోవడంతో తనే స్వయంగా ప్రతీ వారం నాలుగు రోజుల పాటు ట్రాక్టర్ నడుపుతూ చెత్త సేకరణ చేయిస్తున్నారు. బుధవారం అటుగా పని నిమిత్తం వచ్చిన ఎంపీడీవో చీకట్ల బాలాజీ వెంకటరమణ గ్రామంలో స్వయంగా సర్పంచే ట్రాక్టర్ నడుపుతూ చెత్తను సేకరించడం గమనించి భాస్కరరావును అభినందించారు.

-పెంటపాడు, (ఆంధ్రజ్యోతి)

రేపు అనంతలో చంద్రబాబు పర్యటన

హంద్రీనీవా కాలువ విస్తరణ, లైనింగ్ పనుల పరిశీలన

అనంతపురం, మే 7(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో హంద్రీనీవా కాలువ విస్తరణ, లైనింగ్ పనులను సీఎం పరిశీలిస్తారు. ముఖ్యమంత్రి కార్యాలయం బుధవారం అధికారికంగా విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం శుక్రవారం ఉదయం 9.30 గంటలకు ఉండవల్లిలోని నివాసం నుంచి సీఎం బయలుదేరి 10.5 గంటలకు విజయవాడ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో బయలుదేరి 10.50 గంటలకు శ్రీసత్యసాయి జిల్లాలోని పుట్టపర్తి ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 10.55 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11.25 గంటలకు ఉరవకొండ నియోజకవర్గంలోని వజ్రకరూరు మండలం ఛాయాపురంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో ల్యాండ్ అవుతారు. 11.35 గంటలకు అక్కడి నుంచి రోడ్డు మార్గాన ఆ గ్రామ సమీపంలోని హంద్రీనీవా కాలువ వద్దకు చేరుకొని కాలువ విస్తరణ, లైనింగ్ పనులను పరిశీలిస్తారు. అనంతరం ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజావేదికకు చేరుకొని 12.15 నుంచి 12.45 గంటల వరకు జలవనరుల శాఖ అధికారులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 1.15 గంటల వరకు భోజన విరామం తీసుకుంటారు. 1.20 నుంచి 2.50 గంటల దాకా ఛాయాపురం ప్రజలతో ముఖాముఖి మాట్లాడతారు. మధ్యాహ్నం 2.55 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకొని హెలికాప్టర్‌లో పుట్టపర్తి ఎయిర్‌పోర్టుకు వెళతారు. అక్కడి నుంచి విమానంలో బెంగళూరుకు పయనమవుతారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీశ్‌తో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. పటిష్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు.

'రేషన్ బియ్యం'పై సిట్ పునర్వ్యవస్థీకరణ

నూతన అధిపతిగా ఆకే రవికృష్ణ నియాకమం

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమ ఎగుమతులపై కాకినాడ జిల్లాలో నమోదైన కేసులు, సంబంధిత ఇతర నేరాల దర్యాప్తును కొనసాగించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ప్రభుత్వం పునర్ వ్యవస్థీకరించింది. ఇప్పటివరకు ఈ బృందానికి అధిపతిగా వ్యవహరించిన ఐపీఎస్ అధికారి వినీత్ బ్రిజ్‌లాల్ ఢిల్లీలోని సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా నియమితులయ్యారు. దీంతో ఆయన స్థానంలో మరో ఐపీఎస్ అధికారి ఆకే రవికృష్ణను 'సిట్' నూతన అధిపతిగా నియమించింది. అదేవిధంగా గతంలో నియమించిన డీఎస్పీల స్థానంలో ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లను, సివిల్ సప్లయిస్‌కు చెందిన ఒక డీఎస్‌వో, ఒక డీఎంను నియమించింది. ఈ బృందంలో సీఐడీ ఎస్పీ బి.ఉమామహేశ్వర్, వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఈడీ, డిప్యూటీ కలెక్టర్ ఎ.శ్రీనివాసరావు (కాకినాడ), మహిళా శిశుసంక్షేమ శాఖ ఆర్జేడీ పి.రోహిణి (కర్నూలు),డీఎస్‌వో కె.మధుసూదనరావు (విజయనగరం), కోనసీమ జిల్లా మేనేజర్ ఎం. బాలసరస్వతి సభ్యులుగా ఉంటారు.

వరుడైన చిన్నతిరుమలేశుడు

ఘనంగా ప్రారంభమైన వైశాఖ మాస బ్రహ్మోత్సవాలు

ద్వారకాతిరుమల, మే 7 (ఆంధ్రజ్యోతి): నుదుటున కల్యాణ తిలకం..బుగ్గన చుక్కతో ముగ్ధమనోహర రూపలావణ్యాలను ఒలికిస్తూ... అలివేలుమంగ, ఆండాళ్ అమ్మవార్లు నడుమ కొలువుతీరిన చిన్నతిరుమలేశుడు పెండ్లి కుమారునిగా ముస్తాబయ్యారు. ఉభయ దేవేరులు పెండ్లి కుమార్తెలయ్యారు. అర్చకులు, పండితులు, ఆగమ విద్యార్థుల వేదమంత్రోచ్ఛరణలు, భక్తుల గోవిందనామ స్మరణలు, మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ జరిగిన ఈ రమణీయ ఘట్టాన్ని వీక్షించిన భక్తజనులు పరవశించారు. శ్రీవారి ఆలయ నిత్యకల్యాణ మండపంపై ఏర్పాటు చేసిన సువర్ణ సింహాసనంపై స్వామి, అమ్మవార్ల కల్యాణ మూర్తులను ఉంచి ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తి దంపతులు పాల్గొని అర్చకులు, పండితులకు దీక్షా వస్త్రాలను అందజేశారు.




కల్యాణవేదిక వద్దకు స్వామి, అమ్మవార్లను తీసుకొస్తున్న అర్చకులు, భక్తులు



ఆకట్టుకున్న నృత్యరూపకం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజున ఆలయ ప్రాంగణంలో ప్రదక్షిణలు చేస్తూ మహిళా కళాకారులు ప్రదర్శించిన నృత్యరూపకం పలువురిని ఆకట్టుకుంది. తణుకుకు చెందిన అంబికా డ్యాన్స్ అకాడమీ బృంద సభ్యులు ముందుగా ఆలయానికి వచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం శ్రీనివాసుడు, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్ల అలంకారాలు ధరించి చెలికత్తెలతో కలసి ప్రదర్శించిన నృత్యరూపకం భక్తులను అలరించింది.

మహావిష్ణువుగా శ్రీవారు



ఆదిశేషుని పడగన శ్రీభూసమేత మహావిష్ణువు అలంకరణలో శ్రీవారు ఆలయ ప్రాంగణంలో భక్తజనులకు దర్శనమిచ్చారు. వైశాఖ మాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా రోజుకో అలంకరణలో చిన వెంకన్న సాక్షాత్కరిస్తారు.


ప్రత్యేక అలంకరణలో స్వామి అమ్మవార్లు

నేడు కాళ్ళకూరు వెంకన్న కల్యాణం

కాళ్ళ, మే 7 (ఆంధ్రజ్యోతి) :కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో రెండోరోజు బుధవారం ఉదయం నిత్యోపాసన, పంచసూక్త హవనం నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను పెండ్లి కుమారుడు పెళ్ళి కుమార్తెలుగా అలంకరించారు. సాయంత్రం స్వామివారికి ఎదుర్కోలు (రాయబార మహోత్సవం) సన్నాహం నిర్వహించారు.స్వామివారి కళావేదిక వద్ద ప్రముఖ భాగవతారిణి సప్పా భారతి ఏలూరు వారిచే ఏకాదశి వ్రత మహత్యం హరికథ నిర్వహించారు. దేవస్థానం ఈవో అరుణ్‌కుమార్, సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు. గురువారం స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్టు తెలిపారు.

జై వాసవి.. జై జై వాసవీ..

మార్మోగిన పెనుగొండ క్షేత్రం ఘనంగా వాసవీ మాత జయంతి పూజలు

పెనుగొండ, మే 7(ఆంధ్రజ్యోతి): జై వాసవీ జై జై వాసవీ.. అంటూ వాసవీమాత నామస్మరణతో పెనుగొండ పురవీధులు మారుమోగాయి. వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా బుధవారం కర్ణాటక, తమిళనాడు, కేరళ, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వచ్చారు. వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వాసవి దీక్షాపరులు, వాసవి శాంతి ధామ్ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి స్వామి (బాలస్వామి), పెనుగొండ రామాలయం నుంచి 102 కలశాలతో మహిళలు, వివిధ వాయిద్యాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరారు. ఆలయంలో ఉదయం రామడుగుల నరసింహమూర్తి నేతృత్వంలో ఆలయప్రధాన అర్చకుడు కోట సుబ్రహ్మణ్యం , అర్చకులు సుప్రభాతం, నగరేశ్వర స్వామికి రుద్రాభిషేకం, అమ్మవార్లకు కుంకుమార్చనలు, వాసవి అమ్మవారికి పంచసూక్తములతో అభిషేకం నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వాసవీ మాలధారులు శ్రీ గణపతి, వాసవీ హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం వాసవి యువజన సంఘం ఆధ్వర్యంలో మేళతాలతో బాణసంచా కాల్పులతో వేడుకగా వెండి రథంలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని ఊరేగించారు. ఆలయ ఈవో గుబ్బల రామ పెద్దింట్లరావు, వాసవీ యువజన సంఘం సభ్యులు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.


కలశాలతో పురవీధులలో ఊరేగుతున్న మహిళలు


వెండి రథంపై అమ్మవారి ఊరేగింపు

వాసవి శాంతి ధామ్‌లో...

వాసవీ శాంతి ధామ్‌లో క్షేత్ర పీఠాధిపతి సరస్వతి స్వామి పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు శిష్టా మణికంఠ తదితరులు ఉదయం పతాక ఆవిష్కరణ, గోపూజలు, వాసవి మాతకు అభిషేకాలు, విశేష హోమాలు, సామూహిక లక్ష మల్లెల పూజలు నిర్వహించారు. కోట్ల సూర్యారావు, నార్కెడిమిల్లి జనార్ధనరావు, భక్తులు పాల్గొన్నారు.

కూరగాయల వ్యర్థాల ఎరువు రెడీ

తణుకు, మే 7 (ఆంధ్రజ్యోతి) : తణుకు కూరగాయల మార్కెట్లో ఏర్పాటు చేసిన యూనిట్‌లో కూరగాయల వ్యర్థాలతో తయారు చేస్తున్న ఎరువు రెడీగా ఉంది. రెండు బిన్‌లలో 500 కేజీల ఎరువు (అరటన్ను) సిద్ధంగా ఉంది. మార్కెట్లో రోజు వారీ వచ్చే కూరగాయల వ్యర్థాల నుంచి ఎరువు తయారు చేసే యూనిట్ ఏర్పాటు చేశారు. సేకరించిన కుళ్లిన కూరగా యలను కటింగ్ మిషన్ ద్వారా చిన్న చిన్న ముక్కలుగా చేస్తారు. అలా చేసిన ముక్కలను గ్రీన్ బిన్‌లో పొరలు పొరలుగా వేస్తారు. ఇలా కనీసం ముప్పయి రోజులు ప్రాసెస్ చేస్తారు. ఆ తర్వాత నాణ్యమైన ఎరువు తయారవుతుంది. ప్రస్తుతం యూనిట్ వద్ద 500 కేజీల ఎరువు అందుబాటులో ఉంది. కేజీ రూ. 15గా ధర నిర్ణయిం చారు. అవసరమైన వారు తణుకు మున్సిపల్ కమిషనర్ పేరుతో చలానా తీయాల్సి ఉంటుంది. అలాగే కూరగాయలు ముక్కలు చేసే సమయంలో ప్రత్యేకమైన లిక్విడ్ (రిసిట్) వస్తుంది. ఇది కూడా మొక్కలకు చాలా ఉపయోగంగా ఉంటుంది. రిసిట్‌ను ఒక లీటరును పది లీటర్ల నీటిలో కలిసి మొక్కలపై పిచికారీ చేయడం వల్ల మంచి ఫలితాలు వస్తాయి.


తయారైన ఎరువును పరిశీలిస్తున్న కమిషనర్


వ్యర్థాల నుంచి తీసిన రిసిట్

ఈ ఎరువు ఎంతో ఉపయోగం

కురగాయల వ్యర్థాలతో తయారు చేసిన ఈ ఎరువు చాలా ఉప యోగం. చాలా మంది రైతులు నుంచి డిమాండ్ ఉంది. దానికి తగిన విధంగా ప్రాధాన్యతను బట్టి అందించే ఏర్పాట్లు చేస్తున్నాం. రానున్న రోజుల్లో మరింత ఎక్కువగా ఎరువు తయారు చేసే విధంగా ప్రణాళిక చేస్తున్నాం.

- టి.రామ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, తణుకు



సామూహిక కుంకుమార్చన

భీమవరం టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా భీమవరం త్యాగరాజ భవనంలో ఆర్యవైశ్య వర్తక సంఘ భవనం, యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం 400 మంది సువాసినిలతో కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలను నిర్వహించారు. పట్టణ వీధుల్లో అమ్మవారిని పల్లకీపై గ్రామోత్సవం నిర్వహించారు. ఆర్యవైశ్య వర్తక సంఘ భవనం అధ్యక్షుడు వబిలిశెట్టి వెంకటేశ్వరావు, కార్యదర్శి తట వర్తి బదిరీ లక్ష్మి నారాయణ, కోశాధికారి కురిశేటి సత్యనారాయణమూర్తి, మండ విజయభాస్కర్, కార్యదర్శి పూసరపు సుబ్బారావు, కేశవరపు రాజశేఖర్, వబిలిశెట్టి ప్రసాదరావు, సభ్యులు పాల్గొన్నారు.

మద్ది ఆంజనేయునికి లక్ష తమలపాకుల పూజ

జంగారెడ్డిగూడెం, మే 7 (ఆంధ్రజ్యోతి) :గురవాయి గూడెం మద్ది ఆంజనేయ స్వామి క్షేత్రంలో బుధవారం స్వామివారికి ఆలయ అర్చకులు లక్ష తమల పాకుల పూజ నిర్వహించారు. విజయ వాడకు చెందిన ముసునూరి పాపమ్మ కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహ రించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదం స్వీక రించారని ఈవో ఆర్‌వి.చందన తెలిపారు.



ప్రజల న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ

- ఆయన సేవలు చరిత్రలో నిలిచిపోతాయి: జస్టిస్ గవాయ్
- ప్రజల విశ్వాసమే న్యాయవ్యవస్థకు ఊపిరి: జస్టిస్ రమణ

న్యూఢిల్లీ, మే 7(ఆంధ్రజ్యోతి): 'జస్టిస్ ఎన్వీ రమణ ప్రజల న్యాయమూర్తి. న్యాయమూర్తిగా ప్రజలకు దూరం కాకుండా.. వారితో కలిసిపోయి సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేశారు' అని కాబోయే సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఎన్వీ రమణ చేసిన సేవలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. జస్టిస్ ఎన్వీ రమణ ప్రసంగాల సంకలనం 'నెరేటివ్స్ ఆఫ్ ద బెంచ్ ఏ జడ్జ్ స్పీక్స్' పుస్తకాన్ని బుధవారం గవాయ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను, జస్టిస్ రమణ మరికొందరు న్యాయమూర్తులం.. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చామని అందుకే ప్రజల సమస్యలు తమకు తెలుసన్నారు. న్యాయవ్యవస్థకు అవసరమైన మౌలిక సదుపాయాల కోసం ఆయన ఎంతో కృషి చేశారని చెప్పారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా తొమ్మిది మంది మహిళ న్యాయమూర్తులను సుప్రీంకోర్టుకు నియమించిన ఘనత ఆయనకే దక్కిందని కొనియాడారు. జస్టిస్ ఎన్వీ రమణ నిత్యం సమాజం గురించే ఆలోచించేవారని సుప్రీం న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్ ప్రశంసించారు. జస్టిస్ రమణను ప్రజా స్నేహితుడిగా విక్రమ్‌నాథ్ అభివర్ణించారు. ఈ సందర్భంగా జస్టిస్ రమణ మాట్లాడుతూ న్యాయవ్యవస్థ అంటే వివాదాలను పరిష్కరించే సంస్థ కాదని, అది రాజ్యాంగ నైతికతకు చిహ్నమని అన్నారు. న్యాయవ్యవస్థలో అన్ని వర్గాలకు స్థానం కల్పించడం, భారతీయ భాషలను కోర్టు విచారణలో భాగం చేయడం, ప్రజలకు న్యాయసహాయం అందేలా చూడడం వంటి వాటిపై తాను దృష్టి కేంద్రీకరించానని తెలిపారు. జాతీయ న్యాయమౌలిక సదుపాయాల అథారిటీ ఒక కళగా మిగిలిపోయిందని చెప్పారు. ప్రజల విశ్వాసం ఉన్నంతకాలమే న్యాయవ్యవస్థ సజీవంగా ఉంటుందన్నారు. ఢిల్లీ హైకోర్టు ఆడిటోరియంలో జరిగిన ఈ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమానికి పలువురు సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు, పాత్రికేయులు హాజరయ్యారు.

కార్పొరేట్‌కు దీటుగా సంక్షేమ విద్యాసంస్థలు

నీట్‌లో ఉచిత కోచింగ్ సెంటర్లను 10కి పెంచుతాం

మంత్రులు డోలా, సంధ్యారాణి వెల్లడి

ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారాలు

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్షేమశాఖ గురుకులాలు, హాస్టళ్ల కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఉన్నాయని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి అన్నారు. ఇటీవల పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరచిన ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు, టీచర్లకు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం నగదు బహుమతులు, మెమెంటోలు అందించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. తొలిసారిగా ఇలాంటి ప్రోత్సాహకాలు ఇస్తున్నామన్నారు. పేద విద్యార్థుల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని చెప్పారు. హాస్టళ్లలో మరమ్మత్తులు, మౌలిక వసతుల ఏర్పాట్లకు రూ. 143 కోట్లు ఖర్చు చేశామన్నారు. నీట్‌లో ఉచిత కోచింగ్ సెంటర్లను ఈ ఏడాది నుంచి 10కి పెంచుతామన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి విద్యార్థులకు రెండు నెలలకు ఒకసారి కాస్మోటిక్ కిట్స్, నాణ్యమైన బియ్యంతో భోజనం అందిస్తామన్నారు. గిరిజన విద్యార్థులు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిభను చాటుతూ అత్యుత్తమ ఫలితాలను సాధించడం ఎంతో గర్వకారణమన్నారు. ప్రతిభకు పట్టం కట్టే విధంగా మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతులు అందించడం సంతోషంగా ఉందన్నారు. అదే విధంగా ఉత్తమ సేవలు అందించిన సాంఘిక సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమశాఖలకు చెందిన ఉద్యోగులు, టీచర్స్‌ను సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. సాంఘిక, గిరిజన సంక్షేమశాఖల ముఖ్యకార్యదర్శి ఎంఎం నాయక్ మాట్లాడుతూ, విద్యార్థులకు ఈ వయస్సులో వచ్చిన అవార్డులు జీవితాంతం గుర్తుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ కార్యదర్శి వి.ప్రసన్నవెంకటేష్, సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్ లావణ్యవేణి, గిరిజన సంక్షేమ గురుకుల సొసైటీ కార్యదర్శి జి.గౌతమి, గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ ఎస్.భార్గవి తదితరులు పాల్గొన్నారు.



యుద్ధానికి మేము సైతం

ముందుకొస్తామంటున్న మిలటరీ మాధవరం మాజీ సైనికులు

పహల్గామ్ ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో పాక్‌పై ప్రతీకారం కోసం భారతావనిలో ప్రతీ పౌరుడి రక్తం మరుగుతోంది. మంగళవారం రాత్రి భారత్ ఆపరేషన్ సిందూర్ పేరుతో పాక్ ఉగ్ర స్థావరాలపై మిసైల్స్‌తో దాడిచేసి ముష్కరులను మట్టుపెట్టిన ఘటన అందరి మన్ననలు అందుకుంది. భారత రక్షణలో నిత్యం పునీతమయ్యే మిలటరీ మాధవరంలో మాజీ సైనికులు పాక్‌పై యుద్ధం కోసం తహతహలాడుతున్నారు. పాకిస్థాన్ ఉగ్రవాదులను పెంచి పోషిస్తూ భారతదేశంపై దొంగ దెబ్బ తీస్తూ పైశాచికానందం పొందుతున్న శత్రుదేశంపై యుద్ధానికి తాము సైతం అంటున్నారు. పహల్గామ్ దాడితో భారత్‌పై ఆధిపత్యం చెలాయించామని అనుకునేలోపే మనదేశం ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదుల స్థావరాలపై మెరుపుదాడి చేసిందని, భారత సైన్య పరాక్రమాలు గతంలో తాము చేసినప్పటి కంటే మెరుగ్గా ఉన్నాయని పాక్‌పై యుద్ధమే సరైన చర్య అని మాజీ సైనికోద్యోగులు చెబుతున్నారు. యుద్ధం వస్తే ప్రజలను అప్రమత్తం చేసేందుకు ముందస్తుగా నిర్వహించే మాక్ డ్రిల్‌లో ప్రభుత్వం ఆదేశిస్తే భాగస్వాముల వుతామని, మిలటరీ మాధవరంలోని కొంతమంది మాజీ సైనికోద్యోగులు తమ అభిప్రాయాలను ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు.

తాడేపల్లిగూడెం రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి) :


మిలటరీ మాధవరంలో సైనిక అమరవీరుల స్తూపం

యుద్ధమే సరైన నిర్ణయం



పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాక్‌పై యుద్ధమే సరైన నిర్ణయం. అదేదిశగా ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. త్రివిధ వర్గాల సైనికాధికారులతో సమాలోచనలు నిర్వహించిన ప్రభుత్వ చర్యలు బాగున్నాయి. ఆపరేషన్ సింధూర్‌తో పాక్‌కు మనదెబ్బ ఏంటో చూపించారు. నేను ఇండియన్ ఆర్మీలో చేసినప్పుడు శ్రీలంక మిలిటెంట్స్‌తో పోరాడాం. అదేవిధంగా జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదిని పట్టుకోవడం నా సర్వీస్‌లో చెప్పుకోదగ్గ ఘట్టం. దానికి భారత ప్రభుత్వం కమాండ్ కార్డు అదించారు. దానిలో భాగంగానే హానర్ కెప్టెన్ హోదా కల్పించారు. ప్రస్తుత పరిస్థితులు యుద్ధం తప్పదనే సంకేతాలు కనిపిస్తున్నాయి. సాధారణ ప్రజలకు ఎలాంటి హాని కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతోపాటు సైనికులను అప్రమత్తం చేయడం, శత్రుదేశాన్ని డిఫెన్స్‌లో పడేయడం మన ప్రభుత్వ విధానాలకు నిదర్శనం.

- బొల్లం వీరయ్య, విశ్రాంత హానర్ కెప్టెన్, మాధవరం

పర్యాటక రంగాన్ని దెబ్బ తీయాలనే దాడి



మన దేశం మొదటి నుంచి సంయమనంతోనే ముందుకు వెళ్తోంది. గతంలో ప్రభుత్వం చేసిన సర్జికల్ స్ట్రైక్ మన బలాన్ని శత్రుదేశానికి రుచి చూపించినా పాక్ మన దేశంపై దాడి చేయాలని ఉగ్రవాదులను పెంచి పోషిస్తోంది. దేశ ఆర్థిక వ్యవస్థకు మూలమైన పర్యాటక రంగాన్ని దెబ్బతీయాలనే అక్కసుతోనే పహల్గాంలో ఉగ్రవాదులు పర్యాటకులపై దాడి చేశారు. గతనెల 22న జరిగిన ఘటనకు దేశం సంయమనం పాటించి మంగళవారం రాత్రి పాక్ సాధారణ పౌరులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ముష్కరుల స్థావరాలపై మిసైల్స్‌తో ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదులను దాడి చేయడం యావత్ భారతీయులను తలెత్తుకునే విధంగా చేసింది.

- ప్రత్తి రామకృష్ణ, రిటైర్డ్ సుబేదార్ మేజర్

నేటి సైనిక శక్తి అద్భుతం



నేను భారత సైన్యంలో పనిచేశానని చెప్పుకోవడానికే గర్వపడుతున్నా. అప్పటి సైనిక శక్తికి.. నేటి సైనిక శక్తికి చాలాతేడా ఉంది. మేం ఆర్మీలో చేసినప్పుడు పాక్‌పై దాడిచేయాలంటే మన భూభాగం దాటి ముందుకు వెళ్లి దాడి చేయాల్సిన పరిస్థితి. లేదంటే మన భూభాగంలోకి వచ్చిన వారిని హతమార్చే వ్యూహం ఉండేది. కానీ ప్రస్తుతం మన దేశం చేపట్టిన దాడులు మన సైనిక బలానికి నిదర్శనం. మన దేశం నుంచే పాక్ ఉగ్ర స్థావరాలు గుర్తించి వాటిని మట్టుబెట్టడం అద్భుతం

- కలగాని ప్రభాకర్, రిటైర్డ్ హవల్దార్, తాడేపల్లిగూడెం

దేశ రక్షణకు ముందుంటాం



నేను ఆర్మీలో రాష్ట్ర రైఫిల్స్‌లో కీలకంగా పనిచేశా. అస్సాం గూర్ఖా రైఫిల్స్‌లో మిలిటెంట్స్‌పై చేసిన యుద్ధంలో వారిపై ఆదిపత్యం సాధించి మెడల్ సాధించడం నా కెరీర్‌లో అది ఒక తీపి గుర్తు. ప్రస్తుతం పాక్ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. వారికి ఆపరేషన్ సిందూర్ ఒక గుణపాఠం. యుద్ధం అనివార్యమైతే మా వంతు దేశ రక్షణకు ముందుంటాం.

- దిరుసుమిల్లి అయ్యప్ప విశ్రాంత హవల్దార్ మాధవరం

తీరంలో పటిష్ఠ రక్షణ చర్యలు

» ఐజీ అశోక్ కుమార్



ఏలూరు క్రైం, మే 7 (ఆంధ్రజ్యోతి) : భారత్, పాక్‌ల మధ్య నెలకొన్న పరిస్థితులపై రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు ముందస్తుగా రక్షణ చర్యలు చేపడుతున్నామని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ తెలిపారు. ఏలూరులో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పహల్గామ్ దాడి, ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో ఏలూరు రేంజ్ పరిధిలోని నాలుగు జిల్లాలు సముద్ర తీర ప్రాంతంలో ఉన్నాయని ఈ ప్రాంతంలో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టామన్నారు. మెరైన్ పోలీస్‌స్టేషన్ సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. పోస్టుగార్డులు సమన్వయంతో సముద్రంపై గస్తీ నిర్వహించడంతో పాటు ఎవరైనా కొత్త వ్యక్తులు, కొత్త వస్తువులు కాని, పడవలు, ఓడలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని మత్స్యకారులకు సూచించామని, వారి సహకారాన్ని తీసుకుంటున్నామన్నారు. ఓఎన్‌జీసీ ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టామని ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనడానికి పోలీసు బలగాలను అప్రమత్తం చేశామన్నారు. ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై చట్టవిరుద్ధమైన, అభ్యంతరకరమైన పోస్టులను సోషల్ మీడియాలో పెడితే సంబంధిత వ్యక్తితో పాటు గ్రూపు అడ్మిన్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. యుద్ధం జరిగితే ప్రజలు ఏ రకంగా రక్షణ చర్యలు తీసుకోవాలో తెలియజేసేందుకు అన్ని జిల్లాల్లోని పోలీసులు మాక్‌డ్రిల్ నిర్వహిస్తారన్నారు.

సైబర్ నేరాల్లో సత్వర దర్యాప్తు..

సైబర్ నేరాల్లో ఎలాంటి జాప్యం లేకుండా వారం రోజుల్లోనే కేసు పురోగతిని సాధించాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఆదేశించారు. ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఉదయం వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కీలకమైన కేసులను గుర్తించి స్పీడ్ ట్రయల్ ద్వారా బాధితులకు న్యాయం, నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్ల పరిధిలో గంజాయి, పేకాట, క్రికెట్ బెట్టింగులపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఏలూరు రేంజ్ పరిధిలోని ఆరు జిల్లాల్లో 22 వేలకుపైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఏలూరు జిల్లాలో ఐదు వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, జంగారెడ్డిగూడెంలో 300 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. ఎస్పీ కేపీఎస్ కిషోర్, ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, త్రి టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు, ఎస్ఐలు రాంబాబు, పలువురు పాల్గొన్నారు.

ఏలూరులో మాక్ డ్రిల్

యుద్ధ వాతావరణాన్ని చూపించిన పోలీసులు

ఏలూరు క్రైం/భీమవరం క్రైం : సైరన్ మోగుతూ వాహనాలు రయ్ రయ్‌మని వెళ్లిపోయాయి. రోడ్లపై ఉన్న వారు ఎక్కడివారక్కడ నిశబ్దం అయిపోయారు. తమ వాహనాలను ఇంజన్ ఆఫ్‌చేసి వెంటనే దిగారు. మరో సైరన్ రాగానే కిందకూర్చుని చెవులు మూసుకుని నెమ్మదిగా పాకుంటూ సమీపంలోని షాపుల్లోకి వెళ్లిపోయారు. అంతలో పెద్ద పెద్ద శబ్దాలు వచ్చాయి. క్షతగాత్రులు కొట్టుమిట్టాడుతున్నారు. పోలీసు వాహనాలు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయాలపాలైన వారిని అంబులెన్సులో ఆసుపత్రికి తరలించారు. ఇంకా ఏమైనా బాంబులు ఉన్నాయేమోనని అనుమానంతో రాక్సీ అనే పోలీస్ జాగిలాన్ని రంగంలోకి తనిఖీలు చేశారు. ఈవిధంగా ఏలూరు నగరలో మాక్ డ్రిల్ నిర్వహించారు. మరోవైపు భీమవరంలో ఆపరేషన్ సిందూర్ అలర్ట్ సందర్భంగా మంగళవారం అర్ధరాత్రి బస్టాండ్, రైల్వేస్టేషన్‌లలో బాంబు స్క్వాడ్‌ల ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు.


ఏలూరులో ప్రజలను అప్రమత్తం చేస్తూ అక్కడ వున్న షాపుల్లోకి పంపుతున్న పోలీసులు


ఏలూరులో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు


ప్రజలకు జాగ్రత్తలు సూచిస్తున్న డీఎస్పీ


భీమవరం రైల్వే స్టేషన్‌లో పోలీసుల తనిఖీలు

సిందూర్ సాహసోపేత చర్య : కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ



భీమవరంటౌన్ : పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉగ్రవాద శిబిరాలపై భారత త్రివిధ దళాలు నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ సాహసోపేత చర్యగా నిలిచిందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. బుధవారం నరసాపురం పార్లమెంట్ బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం మాట్లాడారు. పహల్గామ్‌లో పర్యాటకుల మీద దాడి చేసి 26 మంది మరణానికి కారణమైన ఉగ్రవాదులకు సంబంధించి పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని శిబిరాలపైన ఈ ఆపరేషన్‌లో భారత సైన్యం, నావికాదళం, వైమానిక దళం సమన్వయంతో కచ్చితమైన దాడులు చేసి, ఉగ్రవాద సంస్థ జైష్ ఏ మొహమ్మద్ (జెఎం) ప్రధాన కార్యాలయాన్ని , వారి శిబిరాలను ధ్వంసం చేశాయన్నారు. ఈ దాడులు భారతదేశం ఉగ్రవాదంపై ఎంత కఠినంగా వ్యవహరిస్తుందో మరోసారి స్పష్టం చేశాయన్నారు. ఈ దాడి ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలపై దాడిగానే చూడాలన్నారు. ప్రధాని మోదీ తీసుకుంటున్న చర్యల వల్ల అభివృద్ధి చెందిన దేశాల కంటే మన ఆర్థిక వ్యవస్థ ఎంతో మెరుగ్గా ఉందని, కేంద్ర ప్రభుత్వం త్రివిధ దళ అధిపతిలతో కలసి ఎటువంటి నిర్ణయం తీసుకున్న అందరూ మద్దతు ఇవ్వవలసిన అవసరం ఉందన్నారు.

ఉగ్ర స్థావరాలే లక్ష్యం



పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌లో పాక్‌లో వున్న ఉగ్రవాద స్థావరాలు లక్ష్యంగా భారత్ దాడులు చేపట్టిందని యుద్ధంలో భారత్ మానవత్వాన్ని చాటుకుంది. ఉగ్రవాద నిర్మూలనకు భారత్ ప్రతీకార చర్యలను చేపట్టింది. పాకిస్థాన్ చర్యలను బట్టి భారత్ ప్రతి చర్య ఉంటుంది. భారత్ తీసుకున్న ఈ నిర్ణయం అన్ని కోణాల్లో మంచి నిర్ణయం. దేశ ప్రజలు ఈ సమయాల్లో ప్రభుత్వానికి, త్రివిధ దళాలకు అండగా, మనో ధైరాన్నిచ్చే విధంగా ఉండాలి.

- బొల్లిన వెంకటరావు, రిటైర్డ్ మేజర్ జనరల్, తణుకు


పాలకోడేరులో దీక్ష చేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గోపాలన్

పేదల ఇళ్లు కూల్చివేత దారుణం

» సీపీఎం రాష్ట్ర సీనియర్ నాయకుడు మంతెన సీతారాం

పాలకోడేరు, మే 7(ఆంధ్రజ్యోతి) : పేదల ఇళ్ల కూల్చివేత దారుణమని, సమస్య పరిష్కారమయ్యే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని సీపీఎం రాష్ట్ర సీనియర్ నాయకులు మంతెన సీతారాం అన్నారు. పాలకోడేరులో ఇళ్ల కూల్చివేతను నిరసిస్తూ విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి సందర్భంగా పాలకోడేరు శివారు అల్లూరి సీతారామరాజు నగర్‌లో పేదల ఇళ్లు కూల్చివేసిన ప్రదేశంలో బుధవారం సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ ఒకరోజు నిరాహార దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ దీక్షను సీపీఎం రాష్ట్ర నాయకుడు మంతెన సీతారాం తొలుత అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం గోపాలన్‌కు సీపీఎం కండువా కప్పి నిరాహార దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ సీతారామరాజు పుట్టిన మోగల్లు గ్రామానికి ఆనుకుని ఉన్న అల్లూరి సీతారామరాజు నగర్‌లో పేదల ఇళ్లను కూల్చివేయడం దారుణమన్నారు. పేదల ఇల్లు ధ్వంసాన్ని ఇకనైనా ఆపాలన్నారు. జేఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ పేదల సమస్య పరిష్కారమయ్యే వరకు తమ పోరాటం సాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాతపాటి హరికుమార్, వైకుంఠరావు, రైతు సంఘం నాయకులు విజయకుమార్, జక్కంశెట్టి సత్యనారాయణ, కె.క్రాంతిబాబు, శేష పత్రియ్య, ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ANDHRA JYOTHI CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి DAILY CLASSIFIEDS క్లాసిఫైడ్స్ (ప్రతిరోజూ)

FINANCE
గవర్నమెంట్ రిటైర్డ్ పెన్షనర్స్‌కు (కేంద్ర/రాష్ట్ర), ప్రభుత్వ ఉద్యోగస్తులకు (కేంద్ర / రాష్ట్ర) సులభ వాయిదాల పద్ధతిలో వెంటనే ఫైనాన్స్ చేయబడును. వెంకటేశ్వర ఫైనాన్స్. Govt. Reg.No.176/2019. Cell: 9550648668
AJD:207833

పాఠకులకు ముఖ్య గమనిక
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

క్రైమ్ కార్నర్

పురుగుల మందు తాగి ఒకరి మృతి

పోడూరు, మే 7(ఆంధ్రజ్యోతి): పోడూరు మండలంలోని కవిటం గ్రామశివారు కవిటం లాకుకు చెందిన కేతా సత్యనారాయణ(59) బుధవారం తెల్లవారుజామున పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని హుటాహుటిన పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడు విజయవాడ సమీపంలోని కంకిపాడులో జామకాయల వ్యాపారం చేస్తుంటాడు. అక్కడే కుటుంబ సభ్యులతో కలిసి అద్దె ఇంట్లో జీవనం సాగిస్తున్నారు. మృతుడు చాలాకాలం నుంచి మద్యానికి బానిసయ్యాడు. తల్లిదండ్రులను చూసేందుకు స్వగ్రామం కవిటం లాకు వచ్చాడు. తల్లిదండ్రులుతో మాట్లాడుతుండగా కుమార్తె ఫోన్ చేసింది. ఇంటిలో రూ.5వేలు కనిపించడం లేదు నీవు తీశావా అంటూ ఆరా తీసింది. కుమార్తె ఫోన్‌చేసి అడగడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగినట్టు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఏఎస్ఐ కె.శ్రీధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎం కార్డు మార్చి రూ.1.51 లక్షలు అపహరణ

ఏలూరు క్రైం, మే 7 (ఆంధ్రజ్యోతి) : ఏటీఎం కార్డును మార్చి నగదు తస్కరించారని పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశారు. ఏలూరుకు చెందిన కందుల సత్యనారాయణ భీమవరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఉద్యోగం చేస్తున్నారు. ఆయన ఈనెల మూడో తేదీన ఏలూరు పాతబస్టాండ్ వద్ద బస్సు ఎక్కడానికి వెళ్తూ సమీపంలోని ఒక ఏటీఎం సెంటర్‌కు వెళ్లారు. అక్కడ ఉన్న ఒక యువకుడిని ఏటీఎం కార్డు ద్వారా వెయ్యి రూపాయలు తీయమని అడిగారు. ఆ యువకుడు ఆ కార్డు ద్వారా వెయ్యి రూపాయలు తీసి కార్డు మార్చి ఇచ్చేశాడు. ఈనెల ఐదో తేదీన తన జీతం సొమ్ములు తీసుకోవడానికి బ్యాంక్‌కు వెళ్లగా డబ్బులు లేవు. లక్షా 51 వేల రూపాయలు ఏటీఎం కార్డు ద్వారా డ్రా చేసినట్లు ఉండడంతో బాధితులు ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. టూటౌన్ సీఐ కె అశోక్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో బంగారం, నగదు చోరీ

ఏలూరు క్రైం, మే 7 (ఆంధ్రజ్యోతి) : పట్టపగలు ఇంటి తలుపులు తీసి ఉండగా ఇంటి ముందు మహిళ పని చేసుకుంటుంది. ఇంటి వెనుక నుంచి దొంగ ఇంట్లోకి ప్రవేశించి దొంగ బంగారం, నగదు అపహరించుకుపోయాడని పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశారు. ఏలూరు ఇజ్రాయిల్ పేటకు చెందిన నలుకుర్తి బెంజిమెన్ రాజు బుధవారం పనిమీద ఇంటి నుంచి బయటకు వెళ్లారు. ఆయన భార్య ఇంటి ముందు పని చేసుకుంటున్నారు. ఇంటి వెనుక తలుపులు తీసి ఉండడంతో దొంగ ఇంట్లోకి ప్రవేశించి ఐదు కాసుల బంగారు ఆభరణాలు, 50 వేల రూపాయల నగదు అపహరించుకుని పోయారు. బీరువా తలుపులు తీసి ఉండడం గుర్తించి ఈ ఘటపై ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ కె అశోక్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతిని మోసగించిన వ్యక్తికి జీవిత ఖైదు

భీమవరం క్రైం, మే 7(ఆంధ్రజ్యోతి): ఓ యువతిని ప్రేమిస్తున్నానని నమ్మించి ముఖం చాటేసిన వ్యక్తికి భీమవరం పోక్సో కోర్టు జీవిత ఖైదు విధించింది. వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు కథనం మేరకు.. భీమవరం గునుపూడికి చెందిన ఒక యువతి 2013లో గోపాలపురానికి చెందిన జ్యేష్ఠ కుమార్‌కిశోర్ పరిచయమయ్యాడు. ఆరేళ్లపాటు ప్రేమిస్తున్నా.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి తర్వాత ముఖం చాటేయడంతో మోసపోయానని గ్రహించిన ఆమె పోలీసులను ఆశ్రయించింది. అప్పటి సీఐ కృష్ణభగవాన్ కేసు నమోదు చేశారు. వాదోపవాదాల అనంతరం బుధవారం భీమవరం పోక్సో కోర్టు న్యాయాధికారి బి.లక్ష్మీనారాయణ కిశోర్‌కు జీవితఖైదు విధిస్తూ, బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున పి.బ్రహ్మయ్య వాదించారు. వన్‌టౌన్ సీఐ నాగరాజు, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ జుల్ఫికర్, ఏఎస్ఐ కోళ్ళ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ రమేష్ బాబు సహకరించారు.

బైక్ ప్రమాదంపై కేసు నమోదు

ముదినేపల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి, కైకలూరు జాతీయ రహదారిలో పెయ్యేరు వైఎస్ఆర్ కాలనీ వద్ద గత నెల 29న బైక్ ఢీకొన్న సంఘటనపై బుధవారం స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఎంఈవో కార్యాలయంలో ఉద్యోగులుగా పనిచేస్తున్న రవితేజ, సందీప్ బైక్‌పై ముదినేపల్లి వస్తుండగా వెనుకనుంచి అతి వేగంగా వచ్చి బైక్‌తో వీరిరువురిని ఢీ కొన్న సంఘటన తెలిసిందే. దీనిపై సందీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్నప్రసాద్

కార్మికులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఏలూరు క్రైం, మే 7(ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మికులు చట్టాలపై అవగాహన పెంచుకుని తమ సమస్యలను పరిష్కరించుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. బుధవారం ఏలూరు రూరల్ మండలం మాదేపల్లిలో కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే ఒకటి నుంచి 7వ తేదీ వరకు కార్మికుల వారోత్సవాలలో భాగంగా కార్మికులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా శ్రమజీవులై కుటుంబ ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలన్నారు. మహిళలకు న్యాయపరమైన సమస్యలు ఉంటే డీఎల్ఎస్‌ను ఆశ్రయించవచ్చని ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తామన్నారు. జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సూర్యచక్రవేణి, ఏపీడీ విక్టర్, ఎంపీడీవో శ్రీలత, కార్యదర్శి వై.సుమలత, గ్రామ సర్పంచ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



ఏలూరు గ్రంథాలయంలో విద్యార్థులతో గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోటేశ్వరరావు

విద్యార్థి దశ నుంచే గ్రంథ పఠనం అలవర్చుకోవాలి

ఏలూరుటూటౌన్, మే7(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే గ్రంథ పఠనం అలవర్చుకోవాలని, తద్వారా విజ్ఞానం సముపార్జించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ కోటేశ్వరరావు అన్నారు. బుధవారం ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాల్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను వేసవి విజ్ఞాన శిబిరంలో నేర్చుకుంటున్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కథలు, కథనాలు, నృత్యాలు, డ్రాయింగ్, గణితం, క్విజ్ పోటీల్లో ఎలా శిక్షణనిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎండలో విజ్ఞాన శిబిరాలకు వస్తున్న విద్యార్థులను అభినందించారు. కార్యదర్శి శేఖర్‌బాబు, రిసోర్స్‌పర్సన్‌లు శ్రీవల్లి, వై.ఫణికాంత్, పీ.శంకర్, కే.తరుణ్, విజయ్‌కుమార్, నారాయణరావు, సందీప్, భాష, లక్ష్మి పాల్గొన్నారు.

నేడు రెడ్‌క్రాస్, తలసేమియా దినోత్సవం

ఏలూరు క్రైం, మే 7(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం, ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని ఏలూరు ప్రభుత్వాసుత్రి ఆవరణలోని రెడ్‌క్రాస్ భవనంలో ఈ నెల 8న నిర్వహిస్తున్నట్టు రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ ప్రసాద్ తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు, కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి, పండ్లు, ప్రొటీన్ పౌడర్, రక్తదాన శిబిరం ప్రభుత్వాసుపత్రి నుంచి ఫైర్‌స్టేషన్ మీదుగా ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

రాజ్యసభ సభ్యుడు 'పాకా'కు ఏపీఎస్టీయే సత్కారం

ఏలూరు అర్బన్, మే 7(ఆంధ్రజ్యోతి) : రాజ్యసభ సభ్యుడిగా ఇటీవల ఎన్నికైన పాకా సత్యనారాయణను బుధవారం ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్(ఏపీఎస్టీయే) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు స్టీవెన్ భీమవరంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేసి సత్కరించారు. ఎంపీ పదవిలోనూ ఆయన మరిన్ని విజయాలు సాధిస్తారని ఆకాంక్షించారు. 'పాకా' కు రాజ్యసభ సీటు ఇవ్వడం పట్ల ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, నితిన్ గడ్కరీలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

విభిన్న ప్రతిభావంతులకు మెగా డీఎస్సీ ఉచిత శిక్షణ

ఏలూరు అర్బన్, మే 7(ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ, ఎస్‌జీటీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న విభిన్న ప్రతిభావంతులైన అభ్యర్థులకు ఉచిత క్రాష్ కోర్సు శిక్షణకు జిల్లాలో అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ రామ్ కుమార్ తెలిపారు. విజయవాడలో నిర్వహించే ఈ శిక్షణకు దృష్టి, వినికిడిలోపం, శారీరక వైకల్యం ఉన్న అభ్యర్థుల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఎండీఎఫ్‌సీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా పంపాలని సూచించారు. కనీసం 40శాతం వైకల్యం ఉన్నవారుమాత్రమే అర్హులన్నారు. టెట్ స్కోరు ఆధారంగా ఎంపికలు జరుగుతాయన్నారు. శిక్షణ, స్టడీ మెటీరియల్స్ ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

ఎల్ఎన్‌డీ పేటను షెడ్యూల్డ్ ప్రాంతం నుంచి మార్చొద్దు

బుట్టాయగూడెం, మే 7(ఆంధ్రజ్యోతి): పోలవరం మండలంలోని ఎల్ఎన్‌డీ పేటను షెడ్యూల్డ్ ప్రాంతం నుంచి తొలగించి మైదాన ప్రాంతంలో చేర్చే ప్రతిపాదనను విరమించుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్టు గిరిజన సంఘం నాయకుడు పోలోజు నాగేశ్వరరావు తెలిపారు. ఎల్ఎన్‌డీ పేట ఏజెన్సీ ప్రాంతంగా ఉందని, గిరిజన చట్టాలు అమలులో ఉన్నాయన్నారు. తమను ఏజెన్సీ ప్రాంతం నుంచి తొలగిస్తే గిరిజన చట్టాలు అమలుకావని, విద్య ఉద్యోగాల్లో తీరని అన్యాయం జరుగుతుందన్నారు. గ్రామాన్ని షెడ్యూల్డ్ ప్రాంతంలోనే ఉంచాలని ప్రభుత్వాన్ని కోరారు.


పెరుగుగూడెంలో చింతమనేనికి పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న నాయకులు

టీడీపీ గ్రామ కమిటీలను ప్రకటించిన ఎమ్మెల్యే

దెందులూరు, మే 7(ఆంధ్రజ్యోతి) : టీడీపీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ ఆధ్వర్యంలో మేదినరావుపాలెం పార్టీ అధ్యక్షుడిగా గారపాటి కొండయ్య, ఉపాధ్యక్షుడిగా బాదంపూడి రమేశ్‌బాబు, పెరుగుగూడేనికి మాజీ సర్పంచ్ యలమర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామాధ్యక్షుడిగా పావులూరి దశరథరామయ్య, రామారావుగూడేనికి దాసరి రాజు, చల్లచింతలపూడికి పార్టీ మండల కార్యదర్శి నాగనబోయిన సత్యనారాయణ, మాజీ సర్పంచ్ మోహన్‌రావుల ఆధ్వర్యంలో వేమన రాముగౌడ్‌లను ప్రకటించారు. ముప్పవరంలో మాజీ సర్పంచ్ కుచ్చర్ల పాటేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామాధ్యక్షుడిగా జ్ఞానేశ్వర్‌లను చింతమనేని ప్రకటించారు. కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మోతుకూరి నాని, ఏఎంసీ ఛైర్మన్ గారపాటి రామసీత, గారపాటి కొండయ్య చౌదరి, బొడేటి మోహన్ బాబు, లావేటి శ్రీను, ఉప్పలపాటి రాంప్రసాద్ పాల్గొన్నారు.

అధ్యాపకుడు మదన్ మోహన్‌కు డాక్టరేట్



చింతలపూడి, మే 7(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు వి.మదన్ మోహన్‌కు నాగార్జున విశ్వ విద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. విశ్వ విద్యాలయంలోని బోటని విభాగంలో ఆచార్య కొక్కంటి మల్లికా ర్జున్ ఆధ్వర్యంలో ఫైటోకెమికల్, న్యూట్రిషినల్, ఫార్మకలాజి కల్, జినోమిక్ ఎక్స్‌ప్లొరేషన్ ఇన్ బర్మ బ్లాక్ రైస్ అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ సందర్భంగా మదన్ మోహన్‌ను కళాశాల ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు, అధ్యాపకులు అభినందనీయమన్నారు.

మాతృదినోత్సవం కరపత్రాల ఆవిష్కరణ

ఏలూరు రూరల్, మే 7(ఆంధ్రజ్యోతి) : మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 11న ఘంటసాల స్వరపీఠం సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి ఎస్.ఎం.సుభాని తెలిపారు. సీనియర్ సిటిజన్స్ విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఏలూరు వైఎంహెచ్ఏ హాల్లో నిర్వహించే ఈ కార్యక్రమాల్లో భాగంగా పలువురు మాతృమూర్తులకు సత్కారాలు చేయనున్నట్టు తెలిపారు. ఈ మేరకు కార్యక్రమాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఘంటశాల స్వర పీఠం అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు, ఈటి అర్జున్ కుమార్, దేవరకొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ భూసేకరణకు మా భూములిస్తాం

పోలవరం, మే 7(ఆంధ్రజ్యోతి) : ఆర్‌అండ్‌ఆర్ భూసేకరణకు తమ భూములివ్వడానికి సిద్ధంగా ఉన్నామంటూ పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు వచ్చిన మంత్రి నిమ్మల రామానాయుడిని బుట్టాయగూడెం మండలం అచ్చియ్యపాలెం, కోయ రాజమండి గ్రామాల రైతులు కోరారు. ఏపీ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు, ఎమ్మెల్యే చిర్రిబాలరాజుల ఆధ్వర్యంలో రైతులు మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. తమ వద్ద 130 ఎకరాల భూమి ఉందంటూ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రైతులు కొయ్యలమూడి దొరబాబు, కాండ్రు వెంకటేశ్వరరావు, వై.నారాయణరావు, మురళి, కొఠారి నరేశ్, వై.వెంకన్న ఉన్నారు.

టీడీపీ నాయకులతో మాజీ మంత్రి ఆళ్ల నాని భేటీ


గన్నితో మాజీ మంత్రి ఆళ్ల నానీ

భీమడోలు, మే 7 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ఆళ్ల నానీ బుధవారం టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులుతో భేటీ అయ్యారు. ఇటీవల టీడీపీలో చేరిన నాని మర్యాదపూర్వకంగా గన్నిని కలిసి పార్టీ పరిస్థితులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ పుట్టా మహేశ్, ఎమ్మెల్యే బడేటి చంటి, టీడీపీ నేత ఘంటా ప్రసాద్ ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన తాటుకూరుగొమ్ము కాలనీ ప్రజలు

వేలేరుపాడు, మే7(ఆంధ్రజ్యోతి): గోదావరికి సాధారణ వరదలొస్తేనే తమ గ్రామం మునిగిపోతోందని, కానీ అధికారులు మాత్రం తమ గ్రామాన్ని ముంపు పరిధి నుంచి తప్పించి తీరని అన్యాయం చేశారని తాటుకూరు గొమ్ము కాలనీ వాసులు కలెక్టర్‌ను కలిసి తమ సమస్యను విన్నవించారు. తమ గ్రామంలో 73 కుటుంబాలున్నాయని ముంపు పరిధి నుంచి తప్పించడంతో తమకు అన్యాయం జరుగుతోందని ఈ విషయంపై అనేక సార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు విన్నవించారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే గ్రామ సభ నిర్వహిస్తామని హామీ ఇచ్చారని గ్రామస్థులు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో భిక్షంరావు, వి.చిట్టి బాబు, కేదాసి విష్ణు, స్పందన, ఎం.జయమ్మ, నంబూరి కనకా, నిర్మల, సీత ఉన్నారు.

సెటిల్‌మెంట్లకు పాల్పడితే సహించను : ఎమ్మెల్యే

జీలుగుమిల్లి, మే 7(ఆంధ్రజ్యోతి) : తనపేరుతో సెటిల్‌మెంట్‌లు, అక్రమ వసూళ్లకు పాల్పడితే సహించేది లేదని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. బర్రింకలపాడులో ఆయన క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలో గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తున్న తరుణంలో తన పేరు చెప్పి కొంతమంది అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని, ఇతర పనులు చేయిస్తామని ప్రజల్ని మోసం చేస్తున్నారన్నారు. అలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు ఏమైనా సమస్యలు వస్తే (89789 89476) సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో గడ్డమణుగు రవికుమార్, పసుపులేటి రాము, కోలా మధు, తదితరులు ఉన్నారు.

10వ రోజుకు సీహెచ్‌వోల నిరసన

ఏలూరు రూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): సీహెచ్‌వోలను క్రమబద్ధీకరించాలని ఏలూరు జిల్లా ఏపీఎంసీఏ అధ్యక్షుడు సొంగా సిద్దయ్య అన్నారు. కలెక్టరేట్ వద్ద కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేపట్టిన నిరసన బుధవారం 10వ రోజుకు చేరుకుంది. రెండేళ్ళుగా జీతభత్యాలపై వినతిపత్రాలిస్తున్నా సమస్య పరిష్కరించడం లేదని సీహెచ్ఏలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో ఎన్‌హెచ్ఎం కింద ఆరేళ్ళుగా సీహెచ్ఏలు పనిచేస్తున్న జీతంలో ఎలాంటి పురోగతి లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సురేంద్ర, చాందిని, విమల పాల్గొన్నారు. ఎన్జీవోస్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, తదితరులు హాజరై ఆందోళనకు మద్దతు తెలియజేశారు.


ఏలూరులో అమ్మవారిని ఆరాధిస్తున్న భక్తులు




ద్వారకాతిరుమలలో పట్టువస్త్రాలు అందజేస్తున్న దృశ్యం... జంగారెడ్డిగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్య వైశ్యులు

ఘనంగా వాసవీ మాత జయంతి

ఏలూరు రూరల్/ ద్వారకాతిరుమల/ టి.నర్సాపురం/ చింతలపూడి / జంగారెడ్డిగూడెం / పోలవరం, మే 7 (ఆంధ్రజ్యోతి): వాసవీ మాత నామస్మరణతో ఏలూరు నగరం మార్మోగింది. ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవీ మాత జయంతి సందర్భంగా శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి సత్రం ఆధ్వర్యంలో జయంతిని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు స్థానిక శ్రీకన్యకా పరమేశ్వరీ ఆలయంలో 26వ తేదీ నుంచి వేద పండితుల ఆధ్వర్యంలో గర్భాలయంలోని మూలమూర్తికి, ఉత్సవ మూర్తికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు వేదోక్తంగా నిర్వహించగా ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి వాసవి మాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహాసభ కార్య రాష్ట్ర కార్యదర్శి అంబికా రాజా సత్రం అధ్యక్షులు దివ్వల జయబాబు, కార్యదర్శి ఊర రామకృష్ణ, కోశాధికారి దేవ నరసింహరావు, ఆర్యవైశ్య నాయకులు ఈ వేడుకలను పర్యవేక్షించారు. ద్వారకాతిరుమల క్షేత్ర ఆర్య వైశ్యకల్యాణ మండప ట్రస్ట్ వద్ద ఉన్న వాసవీమాత ఆలయంలో ట్రస్ట్ ఛైర్మన్ బొండాడ రాం పండు, ఆర్యవైశ్య సంఘ మండలాధ్యక్షుడు ఇమ్మడి రత్నాజీ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. టి.నర్సాపురం మండలంలోని బొర్రంపాలెం, కేతవరం, గంజినీరు పాలెం, మక్కినవారిగూడెం గ్రామాల్లో వాసవి పరమేశ్వరి జయంతిని నిర్వహించారు. చింతలపూడి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ మాత జయంతిని పురస్కరించుకుని కోదండ రామాలయంలో పంచామృత అభిషేకం, పూజలు, అర్చనలు జరిపారు. సాయంత్రం జీబీజీ రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి 108 కలశాలతో ఆర్యవైశ్య మహిళలు, పురుషులు ఒకే రకమైన వస్త్రాలు ధరించి అమ్మవారిని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. అనంతరం మహిళలు, సంఘ అధ్యక్షులు వజ్రపు శేఖర్,కార్యదర్శి కొనకళ్ళ ప్రసాద్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జంగారెడ్డిగూడెం వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ, ఆలయ కమిటీ ఛైర్మన్ కర్పూరం నారాయణరావు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు టీవీఏ తారకం, మహంకాళి రామ్మోహనరావు, చామర్తి శ్రీరాములు, మహంకాళి రంగ ప్రసాద్, పసుమర్తి సాయి, యిమ్మడి బాల భాస్కర్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. పోలవరంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అర్చకుడు పైడపల్లి ఫణికుమార్ శర్మ ఆధ్వర్యంలో నదీ జలాలతో అమ్మవారికి కలశాభిషేకం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

పెట్టుబడి సాయం పొందండి

కుక్కునూరు, మే 7(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకంలో భాగంగా రూ.20 పెట్టుబడి సాయం పొందడానికి రైతు సేవా కేంద్రాలను రైతులు సంప్రదించాలని వ్యవసాయధికారి బాలాజీ తెలిపారు. రైతులు తమ ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకాలు నకలుతో రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు. అలాగే డాక్యుమెంట్లలో ఏమైనా తప్పులుంటే సరిచేసుకోవచ్చని తెలిపారు.


విగ్రహానికి పూలమాల వేస్తున్న చింతమనేని

మేరీమాత విగ్రహం ప్రతిష్ఠ

ఏలూరు రూరల్, మే 7(ఆంధ్రజ్యోతి) : మహేశ్వరపురం గ్రామంలోని కొల్లేటి నిష్కలంక హృదయ మేరీ మాత టవర్ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని టవర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు రూరల్ మండల పార్టీ అధ్యక్షులు నంబూరు నాగరాజు, క్లస్టర్ ఇంచార్జీ నేతల రవి పాల్గొన్నారు.

ఉద్యోగుల సంఘం ఎన్నిక

చింతలపూడి, మే 7(ఆంధ్రజ్యోతి) : ఏపీ పంచాయతీరాజ్ మినిస్టర్ ఉద్యోగుల సంఘం చింతలపూడి యూనిట్ ఎన్నికలు స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులుగా జి.శ్రీధర్‌రాజు అధ్యక్షతన ఈ ఎన్నికలు నిర్వహించారు. నూతన అధ్యక్షునిగా బందెల శ్యాం ప్రకాశ్, ఉపాధ్యక్షుడిగా బి.అశోక్‌కుమార్, కార్యదర్శిగా కె.ప్రసన్నకుమార్, సహాయ కార్యదర్శిగా షేక్ మీరా, కోశాధికారిగా టి.అజయ్ దీరజ్, జిల్లా కౌన్సిలర్‌గా వి.రమేష్, భూక్యా రామకృష్ణ ఎన్నికయ్యారు. చింతలపూడి, లింగపాలెం, కామవరపుకోట, టి.నర్సాపురం మండలాలకు చెందిన ఉద్యోగులు ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరు రూరల్, మే 7(ఆంధ్రజ్యోతి) : చాటపర్రు సెక్షన్ పరిధిలోని చాటపర్రు - గుడివాక లంక, కొమడవోలు- ఆటోనగర్ ఫీడర్ పరిధిలోని శుక్రవారం మరమ్మతులు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కోటేశ్వర దుర్గాపురం, తిమ్మారావు గూడెం, గుడివాకలంక, మొండికోడు, ప్రత్తికోళ్ళలంక, పైడిచింతపాడు, కొక్కిరాయిలంక, కోమటిలంక, పెద్దయగిరిమిల్లి, చిన్నయగిరిమిల్లి, కొమరవోలు, తూర్పు లాకులు, సాయినగర్, ఇందిరమ్మ కాలనీ ఏరియాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కె.ఎం. అంబేడ్కర్ తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పరిపాలనాధికారికి సత్కారం

ఏలూరు రూరల్, మే 7(ఆంధ్రజ్యోతి) : ఏలూరు మండల పరిషత్ పరిపాలనాధికారిగా పనిచేస్తున్న వై.సుజాత కామవరపుకోట ఎంపీడీవోగా పదోన్నతిపై వెళుతుండడంతో ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం సిబ్బంది ఆధ్వర్యంలో ఆమెకు పదోన్నతి అభినందన ఆత్మీయ సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, ఎంపీడీవో వెన్న శ్రీలత మాట్లాడుతూ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మండల పరిధిలో చేసిన సేవలను కొనియాడారు. అనంతరం శాలువ కప్పి జ్ఞాపికతో సత్కరించారు.

సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభం

చింతలపూడి, మే 7(ఆంధ్రజ్యోతి) : నగర పంచాయతీలో గత పదిహేను సంవత్సరాలుగా వెలగకుండా అలంకార ప్రాయంగా ఉన్న సెంట్రల్ లైటింగ్ పనులు పునరుద్ధరణకు ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ బుధవారం పాత బస్టాండ్ వద్ద పనులకు కొబ్బరికాయ కొట్టి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు జె.ముత్తారెడ్డి, సి.హెచ్.ధర్మరాజు, అట్లూరి శ్రీనివాసరావు, కె.రాజారెడ్డి, తోట వెంకట నారాయణ, పలువురు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రోషన్ పర్యటన

జంగారెడ్డిగూడెం, మే 6(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే రోషన్ కుమార్ గురువారం ఉదయం పట్టణంలో పర్యటించనున్నట్టు రావూరి కృష్ణ తెలిపారు.పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొంటారని కూటమి నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెనుమర్తి రామ కుమార్, తూటిగుంట రాము, బొబ్బర రాజ్ పాల్ కుమార్, మిడతా పెంటయ్య పాల్గొన్నారు.

భారీగా సారా పట్టివేత

పోలవరం, మే 7(ఆంధ్రజ్యోతి) : ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడుల్లో బుధవారం 125 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. పోలవరం మండలం ఎల్.ఎం.డి.పేట గ్రామంలో సారా కాస్తుండగా దాడులు నిర్వహించి ఒకరిని అదుపులోకి తీసుకుని, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సూపరింటెండెంట్ అజయ్ కుమార్ తెలిపారు.

సీఆర్‌ఆర్‌లో క్యాంపస్ ఇంటర్వ్యూలు

ఏలూరు అర్బన్, మే 7(ఆంధ్రజ్యోతి) : సీఆర్‌ఆర్ కళాశాలలో బుధవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన హెటిరో ల్యాబ్స్‌లో వివిధ ఉద్యోగ నియామకాలకు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 25 మందిని ఎంపిక చేసినట్టు కంపెనీ హెచ్ఆర్ విజయ్ కుమార్ తెలిపారు. కరస్పాండెంట్లు డాక్టర్ విష్ణుమోహన్, కానాల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రామరాజు పాల్గొన్నారు.




అల్లూరి విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కిశోర్


పందిరిమామిడిగూడెంలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గిరిజనులు

అల్లూరికి ఘన నివాళి

దేశానికి జీవితాన్ని అంకితం చేశారు : కలెక్టర్... సరైన ఆయుధం లేకుండా పోరాడిన ధైర్యశాలి : ఎస్పీ కిశోర్

ఏలూరు రూరల్ /ఏలూరు క్రైం / ఏలూరు కార్పొరేషన్ / బుట్టాయగూడెం / జీలుగుమిల్లి / చింతలపూడి / జంగారెడ్డిగూడెం, మే 7(ఆంధ్రజ్యోతి) : దేశం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన అల్లూరి సీతారామరాజును నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సం దర్భంగా ఏలూరు కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ పి.ధాత్రిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ అల్లూరి చేసిన స్వాతంత్ర్య పోరాటం ఎందరో వీరులకు స్ఫూర్తినిచ్చిందన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, సెట్‌వెల్ సీఈవో కె.ఎస్.ప్రభాకరరావు, పాల్గొన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ఎస్పీ కేపీఎస్ కిశోర్ పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఎస్పీ కేపీఎస్ కిషోర్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు సహాయ సహకారాలు అందించాలనే ముఖ్య సంకల్పంతో ఎటువంటి ఆయుధాలు లేకుండానే బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మహాయోధుడని కొనియాడారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఎన్.సూర్య చంద్రరావు, ఎఆర్ డీఎస్పీ బి.చంద్రశేఖర్, ఎఆర్ఆర్ఐ పవన్ కుమార్, బీసీఆర్‌బీ ఎస్ఐ రాజారెడ్డి, హోంగార్డు ఆర్ఎస్ఐ భాస్కర్ పాల్గొన్నారు. మండలం లంకపాకల, నూతిరామన్నగూడెం, పందిరిమామిడి గూడెం తదితర గ్రామాల్లో సీపీఎం, సీపీఐ, న్యూడెమోక్రసీ, పీడీఎస్‌యూ, పీవైఎల్, పీవోడబ్ల్యు, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో అల్లూరి వర్ధంతిని నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని కార్యక్రమాల్లో కారం రాఘవ,వెట్టి భారతి, ఎం.నాగమణి, టి.బాబూరావు, తెల్లం రామకృష్ణ, ఈ.భూషణం, కె.లెనిన్, బి.వినోద్ మాట్లాడారు. కామవరపుకోట గ్రంథాలయం వద్ద అల్లూరి సీతారామ రాజు వర్ధంతిని సీపీఐ కామవరపుకోట మండల సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి టి.వి.ఎస్.రాజు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు షేక్ ఇబ్రహీం, గ్రంథాలయ అధికారి ఎం.భీమరాజు, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆర్ఆర్‌పేటలోని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు సెంటర్‌లోని విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, జిల్లా సమితి కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, ఏఐటీయూసీ జిల్లా సమితి ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, రెడ్డి శ్రీనివాస డాంగే, పళ్ళెం కిషోర్, బళ్ళ కనకారావు, అప్పలరాజు, భజంత్రి శ్రీనివాస్, పి.సోమశేఖర్ పాల్గొన్నారు. చింతలపూడి ఏరియా ఆసుపత్రిలోని ఆవరణలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద కూటమి ఆధ్వర్యంలో, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో విడివిడిగా కార్యక్రమాలు జరిగాయి. ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కూడా వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. జిల్లా కో-కన్వీనర్ తొర్లపాటి రాజు, పిట్టా చందు, అంబేద్కర్ పాల్గొన్నారు. జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే చిర్రిబాలరాజు పోరాట యోధుడు అల్లూరికి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రవికుమార్, మండలాధ్యక్షులు కె.రాము ఉన్నారు. జంగారెడ్డిగూడెం మండల వ్యాప్తంగా ఐఎఫ్‌టీయూ, పీడీఎస్‌యూ, బీజేపీ, డీవైఎఫ్ఐ తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అల్లూరి వర్ధంతిని నిర్వహించారు. ఏలూరు రోడ్డులోని అల్లూరి విగ్రహానికి ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.వి. రమణ, బీజేపీ నాయకులు కొప్పాక శ్రీనివాసరావు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్య కిరణ్, పీడీఎస్‌యూ నాయకులు ఈ.భూషణం, మంచిలి రాజు, డీవైఎఫ్ఐ మాబూ సుభానీ, బీజేపీ నాయకులు పివి.రామలక్ష్మి, తాటికొండ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

వీవోఏలను తొలగించడం అన్యాయం

లింగపాలెం, మే7(ఆంధ్రజ్యోతి) : మండలంలో 20 ఏళ్లగా పనిచేస్తున్న సీఏలను నిబంధనలకు విరుద్ధంగా తొలగించడం అన్యాయమని సీఐటీయూ నాయకులతో కలిసి మండల కేంద్రమైన లింగపాలెంలో వెలుగు వీవోఏలు నిరాహారదీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా లింగపాలెం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సీఏలతో పాటు 11 మంది వీవోఏలను తొలగించడం సరికాదన్నారు. తమకు న్యాయం చేయాలంటూ నూజివీడు సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు తమను విధులలోకి తీసుకునేంత వరకు నిరాహార దీక్ష కొనసాగిస్తామన్నారు. వారితో పాటు సీఐటీయూ నాయకురాలు సుభాషిణి, వీవోఏలు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్‌వద్ద ఏపీటీఎఫ్ ధర్నా

ఏలూరు అర్బన్, మే 7(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు, 12వ పీఆర్సీ అమలు, పెండింగ్ డీఏల మంజూరు, తదితర డిమాండ్ల సాధనకు చేపట్టిన దశలవారీ ఉద్యమంలో భాగంగా ఈ నెల 9న ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రామారావు, రెడ్డిదొర తెలిపారు. ప్రభుత్వం అమలు చేయనున్న 9రకాల పాఠశాలల వల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలన్నీ నిర్వీర్యమవుతాయన్నారు. 11వ పీఆర్సీ బకాయిలుసహా, అన్నిరకాల ఆర్థిక బకాయిల చెల్లింపునకు నిధులు విడుదలచేయాలని కోరారు. కలెక్టరేట్‌వద్ద నిర్వహించే ధర్నాకు అన్ని మండలాలనుంచి ఉపాధ్యాయులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.


రమేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా రమేశ్

జీలుగుమిల్లి, మే: 7(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్‌గా కె.రమేశ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో జీలుగుమిలిలో పనిచేసిన పద్మిని అనకాలపల్లి బదిలీ అవ్వడంతో ఆ స్థానంలో ఏలూరు ఎస్‌పీఎం నుంచి రమేశ్ ఇక్కడకు వచ్చారు. ఈ మేరకు విద్యుత్ అధికారులు సిబ్బంది శ్రీనివాస్, సుబ్బారావు, నాగేశ్వరలు ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

మినీ ట్రాక్టర్లు పంపిణీ చేసిన ఎంపీ

భీమడోలు, మే 7(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్న వ్యవసాయ పనిముట్లను సద్వినియోగపర్చుకోవాలని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ అన్నారు. భీమడోలులోని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని క్యాంపు కార్యాలయంలో వ్యవసాయాంత్రీకరణ పనిముట్ల పంపిణీ జరిగింది. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై రైతులకు మినీ ట్రాక్టర్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీతో పాటు ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు.

'ఆంధ్రజ్యోతి' ఫోన్‌ఇన్‌కు కృతజ్ఞతలు

» బస్సు సర్వీసు ఏర్పాటుపై సర్వత్రా హర్షం

దెందులూరు, మే 7(ఆంధ్రజ్యోతి) : ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ ప్రజా సమస్యల పరిష్కారానికి 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' కృషి చేస్తోందని ప్రజల నుంచి సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. గత నెల ఫోన్ ఇన్ కార్యక్రమం ద్వారా ఆర్‌టీసీ అధికారులతో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎం.భూషణం ఫోన్ చేసి దెందులూరు, ద్వారకాతిరుమల మీదుగా విజయవాడ వరకు బస్సులు తిప్పాలని కోరారు. ఆయన విజ్ఞప్తి మేరకు ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు సర్వీసులను ఏర్పాటు చేశారు.ఉదయం 8 గంటలకు ద్వారకాతిరుమలలో బస్సు బయల్దేరి ఏలూరు, దెందులూరు మీదుగా విజయవాడ వెళ్లేలా షెడ్యూల్ రూపొందించారు. బస్సు ఏర్పాటుతో దాదాపు 20 గ్రామాల ప్రజలతో పాటు భూషణం, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.

దేవాలయాల ట్రస్ట్ బోర్డుల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

(ఐదో పేజీ తరువాయి)

(టి.నర్సాపురం),కొండ్రాడ్డమ్మ గుడి (టి.నర్సాపురం), పోలవరం మండలంలో భావన్నారాయణ స్వామి గుడి (పట్టిసీమ), వీరేశ్వరస్వామిగుడి (పట్టిసీమ), కొయ్యలగూడెం మండలంలో సీతారామస్వామి గుడి (రాజవరం), కైకలూరు మండలంలో రామలింగేశ్వర స్వామి గుడి (కైకలూరు), గోకర్ణేశ్వరస్వామి గుడి (గోకర్ణపురం), కనకలింగేశ్వరస్వామిగుడి(కైకలూరు), శ్యామలాంబ గుడి (కైకలూరు అర్బన్), వేంకటేశ్వర స్వామి గుడి (కైకలూరు అర్బన్), పెద్దింట్లమ్మగుడి (కొల్లేటికోట), కలిదిండి మండలంలో నాగేశ్వరస్వామి గుడి(పెదలంక), వేంకటేశ్వరస్వామి గుడి(కలిదిండి), సోమేశ్వరస్వామి గుడి(కోరుకల్లు), పాతాళ భోగేశ్వర స్వామి గుడి (కలిదిండి), మండవల్లి మండలంలో మల్లేశ్వరస్వామి గుడి (మండవల్లి), ఉంగుటూరు మండలంలో మాధవస్వామిగుడి (రాచూరు), రామలింగేశ్వరస్వామిగుడి(రాచూరు), బాలగోపాల సత్రం (కాగుపాడు), భీమేశ్వరస్వామిగుడి (ఉంగుటూరు), విశ్వేశ్వరస్వామిగుడి(కంసాలిగుంట),భీమడోలు మండలంలో సీతారామస్వామిగుడి(మల్కాపురం), రామలింగేశ్వరస్వామి గుడి, బృహద్ వైశిష్ట సంప్ర దాయ చిదానంద ఆశ్రమం (పూళ్ల), సకలేశ్వర సత్రం (పూళ్ల), సీతారాస్వామిగుడి (గుండుగొలను), నిడమర్రు మండలంలో కేశవస్వామిగుడి (అడవికొలను), రాజేశ్వర స్వామి గుడి (నిడమర్రు), కేశవస్వామిగుడి (అడవికొలను), సోమేశ్వరస్వామి గుడి(అడవికొలను), సర్వేశ్వరస్వామిగుడి(కాకరమిల్లి), మల్లేశ్వరస్వామి గుడి (చానమిల్లి), కరుణానిధి లక్ష్మీనర్సింహస్వామిగుడి (నాగన్నమిల్లి).

అధికారులు జవాబుదారీగా పని చేయాలి



ఏలూరు టూటౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు జవాబుదారీతనంగా పని చేయా లని ఎంపీ మహేశ్ కుమార్ అన్నారు. ఎంపీ క్యాంపు కార్యా లయంలో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజ కవర్గ నలుమూలల నుంచి ప్రజలు తరలి వచ్చారు. ప్రజా సమస్యలు విన్న ఎంపీ మహేశ్‌కుమార్ అప్పటికప్పుడే అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

వైసీపీ విధానాల వల్లే సమస్యలు

ఏలూరు టూటౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ అస్తవ్యస్త పాలనతో రాష్ట్రంలో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్టవేశాయని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పదినెలల్లోపే వైసీపీలో తిష్ట వేసిన ఎన్నో సమస్యలను పరిష్కరించామన్నారు. ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

కాలువ మరమ్మతుల పనులు ప్రారంభం

దెందులూరు, మే 7(ఆంధ్రజ్యోతి): సీతంపేట కాలువ మరమత్తులను తొలకరి నాటికి పూర్తి చేయాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌లు అధికారులను ఆదేశించారు. బుధవారం దెందులూరు గ్రామ పరిధిలో రూ.77.45 లక్షలతో చేపట్టనున్న సీతంపేట కాలువ సైఫన్ మరమ్మతుల పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కాలువ వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని టీడీపీ మండలాధ్యక్షుడు మాగంటి మిల్లుబాబు, సర్పంచ్ యేసమ్మ, ఎంపీటీసీ శేషారత్నం, టీడీపీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అలుగులగూడెం గ్రామస్థులు తమ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకురాగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ ఎంపీ సహకా రంతో దెందులూరు నియోజకవర్గాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామన్నారు.

ముంపు మండలాల సమస్యలపై వినతి

బుట్టాయగూడెం, మే 7(ఆంధ్రజ్యోతి): వేలేరుపాడు, కుక్కునూరు ముంపు మండలాల్లో డీఎస్సీ అభ్యర్థుల సమస్యలకు పరిష్కారం లభించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమైంది. ఈ మేరకు విజయవాడలో ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి ఆధ్వర్యంలో బుధవారం ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ నాయకులు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోనా శశిధర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ముంపు మండలాల్లోని అభ్యర్థులు డీఎస్సీకి ఆన్‌లైన్లో దరఖాస్తు చేస్తుంటే నాన్ లోకల్ అని వస్తుందని సమస్యను తెలియజెప్పడంతో విద్యాశాఖ కమిషనర్‌తో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపారు. అలాగే గిరిజన సంక్షేమ శాఖలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలంటూ ఎమ్మెల్సీ గోపిమూర్తి ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.మల్లికార్జున నాయక్‌ను కలిసి నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మొడియం శ్రీనివాసరావు, జలగం రాంబాబు, తెల్లం రాములు, సరియం నాగేశ్వరరావు, కుంజం రమేష్, తెల్లం గంగరాజు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే జ్ఞాపకశక్తి

కలిదిండి మే 7 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి పెంపొందుతుందని కలిదిండి గ్రంథాలయాధికారి జె.రమేష్ బాబు అన్నారు. బుధవారం వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా కలిదిండి గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనంపై శిక్షణ ఇచ్చారు. పుస్తక పఠనంలో విద్యా వికాసం, శ్రమశిక్షణ పెంపొందుతాయన్నారు. అనంతరం విద్యార్థులకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. కోరుకొల్లు గ్రంథాలయంలో స్పోకెన్ ఇంగ్లీష్, పుస్తక పఠనంపై శిక్షణ ఇచ్చారు. కోరుకొల్లు గ్రంథాలయాధికారి రాఘవులు, ఆర్.బాలాజీలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నూజివీడు
నూజివీడు, కైకలూరు
7 www.andhrajyothy.com ● గురువారం 8 మే 2025

ముగిసిన 72 గంటల సర్వనామ సంకీర్తన

కైకలూరు, మే7(ఆంధ్రజ్యోతి): కైకలూరు వీరబ్రహ్మేంద్రస్వామి 45వ ఆరాధన ఉత్సవాలను పురస్కరించుకుని చేపట్టిన 72 గంటల సర్వనామ సంకీర్తన భజన దిగ్విజయంగా పూర్తిచేశారు. బుధవారం స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాత్రి శంఖుచక్రాలు, శివలింగ ఆకృతిలో పుష్పాలంకరణ, 108 దీపాలతో అలంకరణ చేసి పూజలు చేశారు. ఆలయ ఛైర్మన్ వెంకటసత్యనారాయణ, సెక్రటరీ రాంబాబు, ట్రెజరర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు.

దేవాలయాల ట్రస్ట్ బోర్డుల ఏర్పాటుకు.. గ్రీన్ సిగ్నల్

(ఐదో పేజీ తరువాయి)

(టి.నర్సాపురం), కొండ్రాడ్డమ్మ గుడి (టి.నర్సాపురం), పోలవరం మండలంలో భావన్నారాయణస్వామి గుడి (పట్టిసీమ), వీరేశ్వరస్వామిగుడి (పట్టిసీమ), కొయ్యలగూడెం మండలంలో సీతారామస్వామి గుడి (రాజవరం), కైకలూరు మండలంలో రామలింగేశ్వరస్వామి గుడి (కైకలూరు), గోకర్ణేశ్వరస్వామి గుడి (గోకర్ణపురం), కనకలింగేశ్వరస్వామిగుడి (కైకలూరు), శ్యామలాంబ గుడి (కైకలూరు అర్బన్), వేంకటేశ్వరస్వామి గుడి (కైకలూరు అర్బన్), పెద్దింట్లమ్మగుడి (కొల్లేటికోట), కలిదిండి మండలంలో నాగేశ్వరస్వామి గుడి (పెదలంక), వేంకటేశ్వరస్వామి గుడి (కలిదిండి), సోమేశ్వరస్వామి గుడి (కోరుకల్లు), పాతాళ భోగేశ్వరస్వామి గుడి (కలిదిండి), మండవల్లి మండలంలో మల్లేశ్వరస్వామి గుడి (మండవల్లి), ఉంగుటూరు మండలంలో మాధవస్వామిగుడి (రాచూరు), రామలింగేశ్వరస్వామిగుడి (రాచూరు), బాలగోపాల సత్రం (కాగుపాడు), భీమేశ్వరస్వామిగుడి (ఉంగుటూరు), విశ్వేశ్వరస్వామిగుడి (కంసాలిగుంట), భీమడోలు మండలంలో సీతారామస్వామిగుడి (మల్కాపురం), రామలింగేశ్వరస్వామి గుడి, బృహద్ వైశిష్ట సంప్రదాయ చిదానంద ఆశ్రమం (పూళ్ల), సకలేశ్వర సత్రం (పూళ్ల), సీతారాస్వామిగుడి (గుండుగొలను), నిడమర్రు మండలంలో కేశవస్వామిగుడి (అడవికొలను), రాజేశ్వరస్వామి గుడి (నిడమర్రు), కేశవస్వామిగుడి (అడవికొలను), సోమేశ్వరస్వామి గుడి (అడవికొలను), సర్వేశ్వరస్వామిగుడి (కాకరమిల్లి), మల్లేశ్వరస్వామిగుడి (చానమిల్లి), కరుణానిధి లక్ష్మి నర్సింహస్వామిగుడి (నాగన్నమిల్లి).

చెరువులను.. ఎండగడదాం!



- రైతులకు ఎంతగానో మేలు
- చేపలు, రొయ్యల సాగులో వ్యాధుల నివారణ
- మరమ్మతులకు అనుకూలం
- అధిక దిగుబడులకు ఆస్కారం

కైకలూరు, మే 7(ఆంధ్రజ్యోతి): చేపలు, రొయ్యలు సాగు చేసే రైతులు సరైన యాజమాన్య పద్ధతులు అవలంబించక నష్టాల బారిన పడుతున్నారు. చెరువులను వేసవిలో పూర్తిగా ఎండగట్టడం వల్ల చేపల, రొయ్యల సాగుకు ఎంతో మేలు జరుగుతుంది. ఎండిన చెరువుల్లో మరమ్మతులు చేసుకోవచ్చు. రైతులు పంటకు పంటకు మధ్య వ్యవధి లేకుండా సాగు చేయడంతో నష్టాలను చవిచూస్తున్నారు. వీటి నుంచి బయట పడాలంటే వేసవిలో పూర్తిగా చెరువులను ఎండగట్టి మేలైన యాజమాన్య పద్ధతులను అవలంబిం చాలని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రయోజనాలివీ..

ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సుమారు 2.50 లక్షల ఎకరాల్లో చేపల, రొయ్యల సాగు జరుగుతోంది. సుమారుగా కొల్లేరు పరిసర ప్రాంతాల్లో లక్ష ఎకరాలు ఉన్నాయి. ఒక వైపు ఉమ్మడి కృష్ణా జిల్లాలో దాళ్వా పంట లేకపోవడంతో కాలువలకు నీరు ముందుగానే నిలుపుదల చేశారు. దీంతో చేపల చెరు వులకు నీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో చెరువులను పూర్తిగా ఎండగట్టుకుని మరమ్మతులు చేసుకోవాలని మత్స్యశాఖ అధికారులు సూచిస్తున్నారు. నిరంతరం ఆక్వాసాగు చేయడం వల్ల చెరువు అడుగుభాగాన వ్యాధికారక క్రిములు ఆవాసాలను ఏర్పరచుకుంటాయి. అవి చేపలు, రొయ్యలకు అంటుకుని వ్యాధులకు కారణమవుతాయి. చెరువును ఎండగట్టి చదును చేయడం వల్ల ఇవి ఎండ వేడికి నశిస్తాయి. చేపలకు ఎక్కువగా వచ్చే పేను వ్యాధి తొలగుతుంది. దెయ్యం చేపలను అరికట్టవచ్చు. రొయ్యల చేపల చెరువుల్లో వైరస్, బ్యాక్టీరియా సంతతిని నిర్మూలించవచ్చు. వ్యాధికారిక క్రిములను మోసుకొల్లే పీతలు, కప్పలను నివారించవచ్చు. మత్స్యశాఖ అధికారుల సూచనల మేరకు చెరువులు బీటలు వచ్చేవరకు ఎండగట్టి చెరువులకు మరమ్మతులు చేసుకుంటే ఆపై వచ్చే పంటలో అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. పాత చెరువులకు ప్రభుత్వ అనుమతులు లేకుండానే తవ్వకాలు చేసుకోవచ్చు. రైతులు ఈ వేసవిలో మట్టి నమూనాలను సేకరించి పరీక్షలు చేయించుకుంటే భూమి సారవంతాన్ని తెలుసుకునేందుకు ఉపయోగపడుతుంది.

మరమ్మతులు ఇలా..

వేసవిలోనే చెరువుగట్లను పటిష్ఠంగా చేసుకోవాలి. గట్ల వెంబడి అనవసరమైన మొక్కలను, చెట్లను తొలగించాలి. చెరువు అడుగు భాగంలో ఎత్తుపల్లాలు లేకుండా సరిచేయాలి. చెరువు అడుగున ఉన్న చెట్ల మొదళ్ళను, కంపలను తొలగించుకోవాలి. ట్రాక్టర్ బ్లేడ్లతో చెరువు అడుగున ఉన్న మట్టిని తొలగించాలి. చేపల చెరువు కనీసం 5 నుంచి 6 అడుగుల నీరు నిల్వ ఉండేలా గట్లను పటిష్ఠ చేసుకోవాలి. ఈ రకమైన పద్ధతులను రైతులు అవలంబిస్తే పంట దిగుబడులను అధికంగా సాధించవచ్చని మత్స్యశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



ముదినేపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): ఊటుకూరు ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మో త్సవాల్లో భాగంగా బుధవారం స్వామివార్ల తిరు కల్యాణో త్సవం వైభవంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేతుడైన వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఆసూరి రంగనాథా చార్యులు ఆధ్వర్యంలో పలువురు దంపతులు జరిపించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించగా, సుమారు 4 వేల మంది స్వామి ప్రసాదాన్ని స్వీకరించారు. గరుడ వాహనంపై స్వామివార్ల గ్రామోత్సవం నిర్వహిం చారు. గ్రామానికి చెందిన హైదరాబాద్‌లో స్థిరపడిన మద్దిల రమేష్ దంపతులు రూ.20 వేలు నగదు, బియ్యాన్ని మచిలీ పట్నంకు చెందిన యర్రంశెట్టి మహాలక్ష్మి, ఉత్సవాలకు మూడు రోజుల పాటు మినరల్ వాటర్‌ను మల్లపరాజు గూడెం సర్పంచ్ దూసనపూడి అవతారం విరాళంగా ఇచ్చారు.

10 నుంచి వడాలిలో జగన్నాథస్వామి బ్రహ్మోత్సవాలు

ముదినేపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): చిన పూరీ జగన్నాథ ఆలయంగా పేరుగాంచిన ముదినేపల్లి మండలం వడాలిలో ఉన్న శ్రీ సుభద్ర, బలరామ సహిత శ్రీ జగన్నాథస్వామి ఆలయంలో ఈనెల 10 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 14వ తేదీ వరకు ఐదురోజులపాటు జరుగుతాయి. ఉత్సవాలను ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ప్రారం భించనున్నారు. ఈనెల 10న జగన్నాథస్వామిని పెండ్లి కుమారుడిని చేయడం, విశ్వక్సేణ పూజ, ధ్వజారోహణ, ఆలయ బలిహరణ, 11న స్వామివారి కల్యాణం, 12న స్వామివార్ల రథోత్సవం, 13న చతుర్థశ కలశ స్నపన, చక్రస్నానం, 14న స్వామివారికి విశేష పూజలు, ద్వాదశ ప్రదక్షిణలు జరుగుతాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈ నెల 15న దేవస్థానం వద్ద అఖండ అన్నసమారాధన జరుగుతుందని ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

కలిదిండి మే 7 (ఆంధ్రజ్యోతి): కలిదిండిలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఈ నెల 8వ తేదీ నుంచి 12 వరకునిర్వహించ నున్నామని ఆలయ ఈవో కె.శ్రీనివాసు తెలిపారు. 8న స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా అలంకరణ, 9న సహస్రనామార్చన, కుంకుమ పూజ, నిత్యహోమం, 10న స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

అల్లూరికి నివాళులు


భుజబలపట్నంలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళుల ర్పిస్తున్న క్షత్రియ సంఘం నాయకులు

ముదినేపల్లి/ కైకలూరు/ కలిదిండి, మే 7 (ఆంధ్రజ్యోతి): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుకు బుధవారం ముదినేపల్లి మండలం రాజానగరం గ్రామంలో క్షత్రియ సంక్షేమ సంఘం ఘనంగా నివాళులర్పించింది. అల్లూరి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి సంక్షేమ సంఘం నాయకులు సాగి సుబ్బరాజు, కొండరాజు రవిరాజు, సూర్యనారాయణరాజు, సాగిరాజు సత్యనారాయణ రాజు, అల్లూరి రమేష్ రాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భుజబలపట్నంలోని ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి క్షత్రియ సంఘం సభ్యులు నివాళులర్పించారు. మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాదరాజు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్య మంలో అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తిదాయకమన్నారు. తాడినాడలో బుధవారం క్షత్రియ సేవాసమితి ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చేపల రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాడినాడ బాబు, మాజీ సర్పంచ్ కొత్తపల్లి రంగరాజు, చేకూరి రామకృష్ణంరాజు, కలిదిండి నాగరాజు, సర్పంచ్ తాడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నీటితొట్టెల నిర్మాణంపై కదిలిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ముదినేపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): పశువులకు తాగునీటి తొట్టెల నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు ముదినేపల్లి మండలంలో వివిధ శాఖల అధికారులు కదిలారు. 'పశువులకు దాహం' అనే శీర్షికన మండలంలో తాగునీటి తొట్టెల నిర్మాణం ముందుకు సాగడం లేదన్న విషయమై ఆంధ్ర జ్యోతిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి ఎంపీడీవో రామకృష్ణ, పశుసంవర్ధకశాఖ అధికారులు డాక్టర్ క్రాంతికుమార్, డాక్టర్ ఆరేపల్లి రామకృష్ణ, ఉపాధి హామీ పథకం ఏపీవో హేమంత్ కుమార్, నీటి తొట్టెల నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టారు. మండలంలో పశువులకు నీటి తొట్టెలు మంజూరు కాగా ఒక్క నీటి తొట్టె నిర్మాణం మాత్రమే పూర్తయిన విషయంపై అధికారులు ఆయా గ్రామాల ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లతో, కార్యదర్శులతో చర్చించారు. వేసవి తీవ్ర రూపం దాల్చుతున్నందున మంజూరైన గ్రామాల్లో పశువులకు నీటి తొట్టెల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వారం రోజుల్లోగా అన్ని గ్రామాల్లో నీటి తొట్టెల నిర్మాణం పూర్తి చేసేందుకు చర్య లు తీసుకుంటున్నామని ఏపీవో హేమంత్‌కుమార్ తెలిపారు.

శిస్తు వసూళ్లను త్వరితగతిన పూర్తిచేయాలి

కైకలూరు, మే 7(ఆంధ్రజ్యోతి): శిస్తు వసూళ్లను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ ఇబ్రహీం అన్నారు. బుధవారం వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో రైతులు భూమి శిస్తు కట్టేలా అందరికి తెలియజేయాలని ఆ గ్రామ సచివాలయం వద్ద అందుబాటులో ఉన్న అధికారులతో చెల్లించి రశీదు తీసుకోవాలన్నారు. శిస్తు చెల్లింపులు ఆన్‌లైన్‌లో జరుగుతున్నందున పంచాయతీ కార్యాలయంలో డిజిటల్ అసిస్టెంట్లు వద్ద పూర్తి వివరాలు ఉంటాయన్నారు. సిబ్బంది ప్రతీరోజూ అందుబాటులో ఉండి వసూళ్లను వేగంగా పూర్తిచేయాలని కోరారు. ఇన్‌చార్జి ఎండీవో ప్రకాషరావు, ఆర్ఐ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బైక్ ప్రమాదంపై కేసు నమోదు

ముదినేపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి, కైకలూరు జాతీయ రహదారిలో పెయ్యేరు వైఎస్ఆర్ కాలనీ వద్ద గత నెల 29న బైక్ ఢీకొన్న సంఘటనపై బుధవారం స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఎంఈవో కార్యాలయంలో ఉద్యోగులుగా పనిచేస్తున్న రవితేజ, సందీప్ బైక్‌పై ముదినేపల్లి వస్తుండగా వెనుకనుంచి అతి వేగంగా వచ్చి వీరిరువురిని ఢీ కొన్న సంఘటన తెలిసిందే. దీనిపై సందీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఆగిరిపల్లిలో వాసవీ కన్యకా పరమేశ్వరి గ్రామోత్సవం నిర్వహిస్తున్న ఆర్యవైశ్య సంఘం

ఘనంగా వాసవీ అమ్మవారి జయంతి

నూజివీడు టౌన్/చాట్రాయి/ఆగిరిపల్లి టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): నూజివీడులో వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహించారు. బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కలశాలతో శోభాయాత్ర, అనంతరం అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమాలను నిర్వహించారు. వాసవీక్లబ్ అధ్యక్షుడు గాదే శివరామకృష్ణ, సెక్రటరీ చిట్టూరి కిశోర్‌కుమార్, కోశాధికారి చలువాది రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. చాట్రాయి మండలం చనుబండ కోదండ రామస్వామి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి నిర్వహించారు. అమ్మవారి విగ్రహానికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం వాసవీమాత విగ్రహాన్ని ఊరేగించారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు నడిపల్లి కిశోర్, మహిళలు పాల్గొన్నారు. ఆగిరిపల్లి మండలం ఆగిరిపల్లిలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు చలవాది వెంకటరత్నం ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం కల్యాణ మండపంలో అమ్మవారికి కుంకుమ పూజ, లలితా సహస్ర నామ పారాయణం జరిగింది. నాలా చిన్న సత్యంబాబు, చలవారి శైలజ, మానేపల్లి సునీత, చలవది మహాలక్ష్మి, ఎం.శివరామమూర్తి, వైసుధీర్, ప్రణీత్, సాంబశివరావు, రాంబాబు, కేతేపల్లి వేణు, చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు నియోజకవర్గంలో..

ముదినేపల్లి/ కలిదిండి,మే 7 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలోని భక్తాంజ నేయస్వామి ఆలయంలో వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి జయంతి కార్యక్రమాలు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగింది. సంఘ అధ్యక్షుడు మాడుగుల పూర్ణచంద్రరావు, వాసవీ సేవా దళ్ రాష్ట్ర కార్యదర్శి వత్తుమిల్లి సత్య వరప్రసాద్, వాసవీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు చీదెళ్ల శారద తదితరుల ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృత అభిషేకాలు, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కలిదిండిలో బుధవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాసవీ మాతకు పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించారు. వాసవీ క్లబ్ అధ్యక్షురాలు వూర దేవి, ప్రధాన కార్యదర్శి సనిశెట్టి సుధారాణి, కోశాధికారి బూర్లే ఉమాదేవి, వూర కళ్యాణి, నీలి మాధవి,ప్రవీణ్, రామారావు, చక్కా జగన్ తదితరులు పాల్గొన్నారు.


చిన్న ఆగిరిపల్లి భూపోరాట ఉద్యమంలో పాల్గొన్న రామకృష్ణ

ప్రభుత్వ భూములు పేదలకు పంచాలి

ఆగిరిపల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. చిన్న ఆగిరిపల్లిలో బుధవారం భూపోరాట కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అసైన్డ్, సీలింగ్ భూములు పేదలకు పంచాలని కోరారు. తోటపల్లి రెవెన్యూలో ఉన్న ప్రభుత్వ భూములు సుమారు 40 ఎకరాలు డాక్టర్ రంగా దామం పినామీలు, పెత్తందారులు, భూస్వాములు ఆక్రమించుకుని పేదల పట్ల దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. పేదలు, దళితుల భూములను భూస్వాములకు కట్టపెట్టాలని చూస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో ఆక్రమిత ప్రభుత్వ భూములను రీసర్వే చేసి పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. సత్తు కోటేశ్వరరావు, అర్జున్‌రావు, అనిల్, అరుణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న శ్రావణి

న్యాయ విజ్ఞాన సదస్సు


నూజివీడు టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): కార్మిక, హక్కులు, చట్టాలపై పూర్తి అవగాహన అవసరమని న్యాయాధికారి కె.శ్రావణి అన్నారు. మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కార్మిక చట్టాల ప్రకారం పనిచేసే సమయం 8 గంటలు మాత్రమేనని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ప్రతిఒక్కరూ బీమా చేయించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మన్నెం రమేష్, సెక్రటరి హరిబాబు, ఏపీపీ వాకా రాజ్‌కుమార్, ప్యానల్ అడ్వకేట్ నందూరి పద్మాంజలి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ గీత

రైతుల నుంచి నీటి తీరువా వసూలు చేయండి

చాట్రాయి, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయాల ద్వారా రైతుల నుంచి నీటి తీరువా వసూలు చేయాలని తహసీల్దార్ గీత కోరారు. మండల రెవెన్యూ కార్యాలయంలో సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. రైతులకు నీటి తీరువా డిమాండ్స్ అందజేసి సకాలంలో నూరు శాతం వసూలు చేయాలని తహసీల్దార్ సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	150,159,170
చికెన్ విత్ స్కిన్	290
చికెన్ స్కిన్‌లెస్	300

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475


కైకలూరు, కలిదిండిల్లో మాక్ డ్రిల్ చేస్తున్న పోలీసు, ఫైర్ సిబ్బంది.. ముదినేపల్లిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వీరభద్రరావు

పోలీసుల మాక్ డ్రిల్

- పలు సెంటర్లలో పోలీసుల అవగాహన కార్యక్రమాలు

కైకలూరు/కలిదిండి/ముదినేపల్లి/ఆగిరిపల్లి/చాట్రాయి, మే 7(ఆంధ్రజ్యోతి): భారత్ - పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పలు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తూ పోలీసులు మాక్ డ్రిల్ చేపట్టారు. కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి కల్యాణ మండపం వద్ద రెవెన్యూ, పోలీస్, ఫైర్ సిబ్బంది ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. కైకలూరు టౌన్, రూరల్ సీఐలు కృష్ణ, రవికుమార్, ఫైర్ ఆఫీసర్ క్రాంతికుమార్, సిబ్బంది పాల్గొన్నారు. కలిదిండిలోను ఫైర్ సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు. ముదినేపల్లిలోను మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఎస్ఐ వీరభద్రరావు సిబ్బంది పాల్గొన్నారు. ఆగిరిపల్లి ప్రధాన కూడలిలో ఎస్ఐ శుభశేఖర్ మాక్‌డ్రిల్‌తో ప్రజలకు అవగాహన కల్పించారు. విమాన దాడుల ముప్పు ఉన్నప్పుడు హఠాత్తుగా తీవ్రమైన శబ్దంతో కూడిన సైరన్లు మోగినప్పుడు, వెంటనే సురక్షిత ప్రాంతాలకు లేదా భద్రత గల గదులకు వెళ్లాలని సూచించారు. పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు. కశ్మీర్‌లో 26 మంది అమాయకులను చంపిన ఉగ్ర మూకను మట్టుబెట్టడానికి భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ నిర్వహించి, ఉగ్ర స్థావరాలను తుత్తునియాలు చేయడంపై చాట్రాయి మండలంలో పలువురు హర్షం వ్యక్తం చేశారు. మందపాటి బసవారెడ్డి, మోరంపూడి శ్రీనివాసరావు, బొట్టు రామచంద్రరావు, మరిడి చిట్టిబాబు, పలగాని దుర్గారావు, బొట్టు లక్ష్మణరావు, కలకొండ భాస్కరరావు, నక్కా రాము తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

తీరంలో పటిష్ఠ రక్షణ చర్యలు

- ఐజీ అశోక్ కుమార్



ఏలూరు క్రైం, మే 7 (ఆంధ్రజ్యోతి) : భారత్, పాక్‌ల మధ్య నెలకొన్న పరిస్థితులపై రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు ముందస్తుగా రక్షణ చర్యలు చేపడుతున్నామని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ తెలిపారు. ఏలూరులో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పహల్గామ్ దాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఏలూరు రేంజ్ పరిధిలోని నాలుగు జిల్లాలు సముద్ర తీర ప్రాంతంలో ఉన్నాయని ఈ ప్రాంతంలో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టామన్నారు. మెరైన్ పోలీస్‌స్టేషన్ సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. కోస్టుగార్డులు సమన్వయంతో సముద్రంపై గస్తీ నిర్వహించడంతో పాటు ఎవరైనా కొత్త వ్యక్తులు, కొత్త వస్తువులు కాని, పడవలు, ఓడలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని మత్స్యకారులకు సూచించామని, వారి సహకారాన్ని తీసుకుంటున్నామన్నారు. ఓఎన్‌జీసీ ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టామని ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనడానికి పోలీసు బలగాలను అప్రమత్తం చేశామన్నారు. ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై చట్టవిరుద్ధమైన, అభ్యంతరకరమైన పోస్టులను సోషల్ మీడియాలో పెడితే సంబంధిత వ్యక్తితో పాటు గ్రూపు అడ్మిన్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుం టామన్నారు. యుద్ధం జరిగితే ప్రజలు ఏ రకంగా రక్షణ చర్యలు తీసుకోవాలో తెలియ జేసేందుకు అన్ని జిల్లాల్లోని పోలీసులు మాక్‌డ్రిల్ నిర్వహిస్తారన్నారు.

సైబర్ నేరాల్లో సత్వర దర్యాప్తు..

సైబర్ నేరాల్లో ఎలాంటి జాప్యం లేకుండా వారం రోజుల్లోనే కేసు పురోగతిని సాధించాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఆదేశించారు. ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఉదయం వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కీలకమైన కేసులను గుర్తించి స్పీడ్ ట్రయల్ ద్వారా బాధితులకు న్యాయం, నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో గంజాయి, పేకాట, క్రికెట్ బెట్టింగులపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఏలూరు జిల్లాలో ఐదు వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. ఎస్పీ కేపీఎస్ కిషోర్, ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, త్రీటౌన్ సీఐ వి.కోటేశ్వరరావు, ఎస్ఐలు రాంబాబు, పలువురు పాల్గొన్నారు.


బూరుగుగూడెంలో పొలాలకు పశువుల ఎరువు తరలిస్తున్న రైతులు

ఖరీఫ్ వ్యవసాయానికి రైతుల సన్నాహాలు

చాట్రాయి, మే 7(ఆంధ్రజ్యోతి): రైతులు ఖరీఫ్ సాగుకు ముందస్తు సన్నాహాలు చేస్తున్నారు. పశువుల ఎరువు భూముల్లో చల్లి వేసవి దుక్కులు దున్ని పచ్చిరొట్ట సాగుకు సమాయత్తం అవుతున్నారు. వ్యవసాయ శాఖ 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు రైతుసేవా కేంద్రాల ద్వారా రైతులకు పంపిణీ చేయనుంది. రబీ మొక్కజొన్న పంట పూర్తి కావడంతో భూములను ఖరీఫ్ సాగుకు సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండుతాయని రైతులు ఆశిస్తున్నారు. మండలంలో 112 సాగునీటి చెరువులు, తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టు కింద 12,200 ఎకరాలు వరిసాగు భూమి ఉంది.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు
నూజివీడు : 99854 02464
కైకలూరు : 99854 11868

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
© సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234